ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

3

సోమవారం 12 ఆగస్టు 2024





బాపట్ల : జగనన్నకాలనీలలో పేదల ఇళ్ళు

పేరుగొప్ప.. ఊరుదిబ్బ

ఇల్లు లేని వారు ఉండకూడదు.. జీవనమే కష్టంగా ఉండే బడుగు జీవుల ఇంటి కలను నెరవేరుస్తాం.. గత ప్రభుత్వాల్లా స్థలాలు ఇవ్వడం కాదు.. స్థలంతో పాటు ఇల్లు కట్టించి ఇస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతూ ఐదేళ్లు కాలయాపనతో సరిపెట్టింది. కాలనీలు కాదు ఊళ్లు నిర్మిస్తున్నామంటూ ఊరూరా జగనన్న కాలనీల పేరుతో పేదలను వంచించింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పేరుతో ప్రభుత్వం హడావుడికే పరిమితమైంది. ఊరూరా వెలిసిన జగనన్న కాలనీలు పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా మారాయి. నిర్మాణాల దగ్గర నుంచి మౌలిక వసతుల కల్పన వరకు అన్నీ సమస్యలుగా ఉన్నాయి. నిర్మాణాలు జరగని ప్రాంతాల్లో కాలనీలు చిట్టడవులను తలపిస్తున్నాయి. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని జగన్ చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. అటు ఇళ్లు వచ్చిన సంతోషం లేక.. మరోవైపు అప్పుల పాలై లబ్ధిదారులు అల్లాడిపోతున్నారు.



బాపట్ల: మూలపాలెం జగనన్నకాలనీలో అసంపూర్తిగా వున్న గృహనిర్మాణాల మధ్య పెరిగిన మొక్కలు



బాపట్ల : మూలపాలెం జగనన్నకాలనీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్లు

- అధ్వానంగా జగనన్న కాలనీలు
- అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు లేక అవస్థలు
- చిన్నపాటి వర్షాలకే కాలనీలు జలమయం
- గృహాల చుట్టూ మురుగునీరు, పిచ్చి మొక్కలు
- బిల్లులు రాక పలు ప్రాంతాల్లో నిలిచిన నిర్మాణాలు
- పేరేచర్లలో పూర్తి కాకముందే కూలుతున్న గృహాలు



రేపల్లె 18వ వార్డు జగనన్న కాలనీలో రహదారి నిర్మాణం చెయ్యకపోవటంతో బురదమయంగా మారిన దృశ్యం

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 11: కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని పదుల ఎకరాల్లో లేఅవుట్లు వేసి వందల మందికి గత జగన్ ప్రభుత్వం స్థలాలు ఇచ్చింది. అయితే జగన్ ఐదేళ్ల పాలనలో ఎక్కడా ప్రభుత్వం చెప్పినట్లు కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. పునాదుల దగ్గరే నిలిచిపోయిన ఇళ్లు, వర్షపు నీటిలో మునిగిపోయిన కాలనీలు, పిచ్చి మొక్కలు, చెట్లతో చిట్టడవుల్లా మారిన పరిసరాలు, మొండిగోడలకే పరిమితమైన నిర్మాణాలు, స్లాబు వేయకముందే పడిపోవడానికి సిద్ధంగా ఉన్న గోడలు, బురద గుంతలతో కూడిన రోడ్లు, నిర్మాణాలు పూర్తి చేసిన ప్రాంతాల్లో బిక్కుబిక్కుమంటూ, సరైన వసతులు లేక అల్లాడుతున్న జనం.. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల దుస్థితి. గుంటూరు జిల్లాలో 247 లేఅవుట్లలో 66,554 ఇళ్లు నిర్మించేందుకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే 18,523 ఇళ్లను మాత్రమే పూర్తి చేశారు. మొత్తంగా గుంటూరు జిల్లాలో 27 శాతం ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. పల్నాడు జిల్లాలో 224 కాలనీలను ఏర్పాటు చేయగా 39,312 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ధేశించింది. ఇప్పటికి 12,224 గృహాల నిర్మాణం పూర్తయింది. 10,842 గృహాల నిర్మాణ పనులు ప్రారంభించి మమ అనిపించారు. 10,672 గృహాలు నిర్మాణం పునాదులు దాటలేదు. పేదల సొంతింటి కల ఐదేళ్ల తర్వాత కూడా కలగానే మిగిలిపోయింది. పేదల ఇళ్ల కోసం ఒక్కొక్కరికీ సెంటు స్థలం పంచి పెట్టి హడావుడి చేసిన జగన్ ప్రభుత్వం.. ఇళ్లు కూడా కట్టిస్తామని ప్రగల్భాలు పలికి పిల్లిమొగ్గలు వేసింది. ఇళ్లు కట్టుకోవడానికి సిద్ధమైన పేదలకు కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద ఇచ్చే గృహరుణాలతో సరిపుచ్చింది. అరకొర నిర్మాణాలు జరిగిన ప్రాంతాల్లో సరైన రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర సౌకర్యాలు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. అపరిశుభ్రత, విష సర్పాలతో ఆయా ఇళ్లలో ఉండలేక కాలనీలు వదిలేసి వెళ్లిపోయిన వారు కూడా ఉన్నారు. తమ సొంతింటి కల అర్థాంతరంగా ఆగిపోవడంతో పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇళ్లు పూర్తి చేయాలంటే ఏం చేయాలో కూడా తెలియని దిక్కుతోచని స్థితిలో పేదలు అల్లాడుతున్నారు. ఆహ్లాదకర వాతావరణంతో పాటు విద్య, వైద్యం అన్నీ కాలనీల్లో ఇంటికి సమీపంలోనే అందేలా ఏర్పాటు చేస్తానని చెప్పిన ప్రభుత్వం కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేకపోయింది. ప్రధానంగా పట్టణ, గ్రామాలకు దూరంగా ఉండే ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటు చేయడంతో రవాణా సౌకర్యం లేక చాలామంది ఇళ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపలేదు. కొందరు ఇల్లు నిర్మించుకుంటే మరి కొందరు బేస్‌మెంట్ వరకూ కట్టి వదిలేశారు. మరి కొందరు కనీసం ఎటువంటి పనులు కూడా ప్రారంభించలేదు. వర్షం కురిస్తే కాలనీలకు చేరాలంటే ప్రజలకు నరకంగా ఉంది. బురదమయమైన రోడ్లతో కనీసం నిత్యం దైనందిన కార్యక్రమాలకు వెళ్లేందుకు కూడా నానా అవస్థలు పడుతున్నారు. ప్రారంభంలో వేసిన గ్రావెల్ కూడా వర్షానికి కొట్టుకుపోయి, గుంతలు మిగలడంతో ఇసుక లారీలు, ట్రాక్టర్‌లు కూడా వెళ్లే వీలులేక నిర్మాణాలు అర్థంతరంగా నిలిచిపోయాయి. స్లాబ్‌వరకూ పూర్తైన ఇళ్లకు బిల్లులు రాకపోవడంతో పేదలు మధ్యలోనే నిర్మాణాలను ఆపేసుకున్నారు. దుగ్గిరాలలో బకింగ్‌హామ్‌కాల్వకు అంచున కాలనీలో ప్లాట్లు ఉండటంతో కాల్వ నిండుగా ప్రవాహం ఉన్నసమయాల్లో ఉరకెత్తుతూ కాలనీపరిసరాలు నీటితో నిండిపోతున్నాయి. జగనన్న కాలనీలో వర్షం వచ్చిందంటే కాలు మోపలేని పరిస్థితి. ఎటు చూసిన రోడ్లన్నీ గుంతలు మయం. చిన్న పాటి వర్షం వచ్చినా కాలు పెట్టలేని దుస్థితి పలు కాలనీల్లో ఉంది. కాలనీవాసులు ప్రయాణించే ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో కనీసం ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి. మాచర్లలో 5110 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వగా 150 మంది మాత్రమే ఇళ్లు కట్టుకున్నారు. పల్నాడులో కొన్ని ప్రాంతాల్లో సెంటున్నర స్థలాలు ఇచ్చినా అవి రాళ్లు, రప్పలు, కొండ గుట్టలుగా నివాస యోగ్యం కాని భూములనే ఎంపిక చేశారు. అనేక గ్రామాల్లో జగనన్న కాలనీలకు ఎంపిక చేసిన స్థలాలు ఊరికి దూరంగా నివాస యోగ్యం కానివి కావడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. ప్రస్తుతం ఇలాంటి ప్రాంతాలన్నీ కూడా చిట్టడవులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు జగనన్న కాలనీలు నిలయాలుగా మారాయి. సత్తెనపల్లి పరిధిలోని పాకాలపాడు, కంకణాలపల్లి, గర్నెపూడి లే అవుట్లలో ఇళ్ళు నిర్మించుకోవటానికి లబ్ధిదారులు ఎవ్వరూ ముందుకు రాలేదు.

కట్టారు.. కూలుతున్నాయి..

గుంటూరుకు అత్యంత సమీపంలో పేరేచర్లలో 4 వందల ఎకరాల్లో కాలనీ ఏర్పాటు చేసి 18వేల ప్లాట్లును లబ్ధిదారులకు పంపిణీ చేసింది. అయితే లే అవుట్ వేయడం వరకు హడావుడి చేసిన అధికారులు గృహ నిర్మాణాలను గాలికి వదిలేశారు. గృహ నిర్మాణాలను చేసుకోలేని లబ్ధిదారుల కోసం నలుగురు కాంట్రాక్టర్లను ఎంపిక చేశారు. వారంతా వైసీపీ వారే కావడంతో ఇష్టారాజ్యంగా గృహ నిర్మాణాలు చేపట్టారు. రూ.70 వేలతో పునాదులతో నిలిపివేసి కాంట్రాక్టర్లు బిల్లులు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో ఆ పునాదులు ప్రస్తుతం పిచ్చి చెట్లతో నిండిపోయాయి. మరికొన్ని గృహాలకు శ్లాబ్‌లు వేశారు. పది కాలాలు పాటు పటిష్టంగా ఉండాల్సిన గృహ నిర్మాణాలు పూర్తి కాకముందే పగుళ్లిచ్చి కూలిపోతున్నాయి. నాసిరకం పనులు చేసి అయిన కాడికి బిల్లులు చేసుకొని కాంట్రాక్టర్లు ఉడాయించగా లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మేతకు వెళ్లిన గేదెల కాళ్లు తగిలి గోడలు కూలిపోతున్నాయంటే నిర్మాణాల పటిష్టత ఏవిధంగా ఉందో తెలుసుకోవచ్చు. 18 వేలకు కేవలం నాలుగు వందల గృహాలు పూర్తికాగా వారు కూడా ఆయా ఇళ్లలో ఉండేందుకు భయపడుతున్నారు. కాలనీలో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు లేవు.



వేమూరు: అబ్బనగూడవల్లిలో బేస్ లెవల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు

ప్రచారం కోసం ప్రారంభోత్సవాలు

లక్షల సంఖ్యలో ఇళ్లు కట్టాము.. ఆ ఇళ్లలో పేదలు ఆనందంగా ఉంటున్నారు.. అని ఎన్నికలకు ముందు ప్రచారం చేసుకున్న జగన్ ఆ పరిస్థితి క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించదు. ఎన్నికలకు ముందు హడావుడిగా కొన్ని ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశం చేయించినట్లుగా హడావుడి చేసింది. అయితే కాలనీల్లో ఈనాటికీ మౌలిక సదుపాయాలు లేవు. కాలనీలకు వెళ్లడానికి కనీసం అప్రోచ్ రోడ్లు కూడా లేవు. రాష్ట్రంలో అతిపెద్ద లే అవుట్‌గా చెబుతున్న గుంటూరు సమీపంలోని పేరేచర్ల లే అవుట్‌కు వెళ్లే దారి అత్యంత దారుణంగా ఉంది. ఇదే పరిస్థితి అన్ని ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో నెలకొని ఉంది. కాలనీలు మురుగునీటిలో మునిగిపోయి, నిర్మాణాలు నానిపోతున్నాయి. విద్యుత్ లైన్లు, వీధిదీపాలు, తాగునీరు వంటి మౌలిక సదాపాయల కల్పన జగన్న కాలనీల్లో మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఈ స్థితిలో ఇళ్లు పూర్తయినా లబ్దిదారులు ఆ వైపు చూడడం లేదు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై పేదల సొంతింటి ఆశ ఆధారపడి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందితే తప్ప వారు ఇళ్లు పూర్తిచేసుకోలేని పరిస్థితి.

అప్పులకు వడ్డీలతో కుదేలు..

కేంద్రం ఇచ్చే రూ.లక్షా 80 వేలు పునాదులకే సరిపోవడంతో నిర్మాణాలు చాలా చోట్ల నిర్మాణాలు అక్కడితోనే ఆగిపోయాయి. మరికొందరు అప్పులు చేసి గోడల వరకూ ఇళ్లను నిర్మించుకున్నారు.. కానీ ఆ తర్వాత స్తోమత లేక, అప్పులు పుట్టక ఇళ్లు మధ్యలోనే నిలిపేసుకున్నారు. ఆగిపోయన ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం లబ్ధిదారులపై పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చినా వారు తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు స్వాధీనం చేసుకుంటామని అధికారులు బెదిరించి కొందరుతో బలవంతంగా నిర్మాణాలు చేపట్టినా ఆయా ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు. ఐదేళ్ల తర్వాత చూస్తే సొంత ఇంటి కల కోసం అప్పులపాలై, ఆ కల నెరవేరక వడ్డీలు కట్టుకుంటూ, ఇళ్లు పూర్తి కాకపోవడంతో ఇళ్లకు అద్దెలు కట్టుకుంటూ లబ్ధిదారులు మరింత కుదేలైపోయారు. నివాసయోగ్యం కానిచోట ముంపునకు గురయ్యే ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి వైసీసీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది.

ఆంధ్రజ్యోతి పరిశీలన



బాపట్ల: ముళ్ళకంపలు, జిల్లేడు చెట్లతో నిండిపోయిన కర్లపాలెం జగన్న కాలనీ



రేపల్లె: బిల్లులు రాకపోవటంతో మధ్యంతరంలోనే నిలిచిపోయిన ఇళ్ళ నిర్మాణం



రేపల్లె డ్రెయిన్‌లో ఏపుగా పెరిగిన తుంగ, మురుగు పారుదల లేక కాలనీవాసులు అవస్థలు

పెరిగిన వరద.. వణుకు

- కృష్ణానదిలో పెరిగిన ప్రవాహం
- ముంపు బారిన పల్లపు ప్రాంతాలు.. పంటలు
- లంక గ్రామాల ప్రజలు, రైతుల్లో భయాందోళనలు



అరవింద వారధి వద్ద వరద ఉధృతి





గాజుల్లంక చినరేవు సమీపంలో వరద నీటి ముంపునకు గురైన మిరప చేను

ముంపు బారిన పూల తోట, వరద నీటిలోనే పూలు కోస్తున్న రైతులు

కొల్లూరు, భట్టిప్రోలు, ఆగస్టు 11: కృష్ణానదికి మళ్లీ స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో లంక గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వరద ప్రవాహం ఒకరోజు తగ్గుతూ ఒక రోజు పెరుగుతుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి ఆదివారం తెల్లవారుజామున దిగువకు 3 లక్షల పైచిలుకు నీటిని బ్యారేజీ అధికారులు విడుదల చేశారు. దీంతో కొల్లూరు మండలంలోని అరవింద వారధి, చింతల్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక పరిధిలోని చినరేవు వెంబడి గ్రామాల పరిధిలోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. చింతల్లంకలో బంతి తోటలోకి, గాజుల్లంక వద్ద చినరేవు ఉప్పొంగడంతో మిరప తోటలోకి వరద నీరు చేరింది. దోనేపూడి వద్ద పోతార్లంక చప్టాపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆ రహదారిలో రాకపోకలను పోలీసులు నిలిపి వేశారు.

పంట రుణాలు.. సగమే

- ఖరీఫ్ లక్ష్యానికి సుదూరంగా బ్యాంకులు
- రూ.5 వేల కోట్లకు ఇచ్చింది రూ.2593 కోట్లే
- ఒక్కరికి కూడా రుణం ఇవ్వని సహకార సంఘాలు

గుంటూరు సిటీ, ఆగస్టు 11: ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉంది. వరుణుడి కరుణతో పుష్కలంగా సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. అయితే వ్యవసాయ ఖర్చులకు పెట్టుబడులపైనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇటీవల జిల్లాల కలెక్టర్లు బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి వ్యవసాయ రుణాలకు లక్ష్యాలు నిర్దేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వారికి వ్యవసాయ రుణాలు ఇవ్వాలని కలెక్టర్లతో పాటు ప్రభుత్వం కూడా ఆదేశించింది. అయితే బ్యాంకర్లు తమ సహజ ధోరణితో రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. లక్ష్యాల్లో ఇప్పటి వరకు సగం రుణాలు కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. లక్ష్యం ఘనంగా ఉన్నా ఇచ్చింది మాత్రమే నామమాత్రమే అన్నట్లుగా పరిస్థితి ఉంది. లక్షా 25 వేల 804 మంది రైతులకు ఖరీఫ్‌లో పంట రుణాలను రూ.5050 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం బ్యాంకర్లకు లక్ష్యాలు నిర్దేశించింది. అయితే ఇప్పటివరకు ఇచ్చింది కేవలం రూ.2593 కోట్లు మాత్రమే. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల్లో ఇంతవరకు ఒక్క రైతుకు కూడా వ్యవసాయ రుణం ఇవ్వలేదు ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు దాటినా పెట్టుబడులకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి నగదు అందుబాటులో లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బ్యాంకర్లు వంతుల వారీగా రుణాలు ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురౌతున్నట్లు రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల రికవరీ ఆధారంగా రుణాలు ఇస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి అక్టోబరు వరకు ఉంటుంది. ఈ ఏడాది జూన్, జూలై మాసాల్లోనే ఎక్కువ మంది రైతులు సాగుకు ఉపక్రమించారు. ఎక్కువ మంది రైతులు రుణాలు మీద ఆధారపడే సాగుకు సిద్ధపడుతున్నారు. తీరా బ్యాంకులు మొండి చేయి చూపిస్తుండటంతో పెట్టుబడులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ బ్యాంకుల్లోనే సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కౌలు రైతులు కూడా రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులకు కిసాన్ కార్డులు ఉన్నా కూడా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు తిప్పుకుంటున్నట్లు సమాచారం.



సొసైటీల్లో అసలే లేవు

వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఇంతవరకు ఒక్క రుణం కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 సహకార సంఘాల్లో ఖరీఫ్ ఆరంభానికి ముందే ప్రణాళికలు రూపొందించి పంపారు. మళ్లీ అంచనాలు పంపాలని చెప్పడంతో విషయం మొదటికి వచ్చింది. సహకార సంఘాల్లో రుణాలు మంజూరు వ్యవహారం గతంలో వివాదాస్పదమైంది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలోని పలు సొసైటీల్లో బోగస్ పాసు పుస్తకాలతో రుణాలు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. దాంతో అప్పట్లో సొసైటీ ప్రెసిడెంట్ల ఆస్తులను జప్తు చేశారు. ఇప్పుడు పంట రుణాలు వ్యవహారంలో పర్సన్ ఇన్‌చార్జిలు ముందుకు రాకపోవడానికి ఇదొక కారణంగా కనిపిస్తుంది. కొద్ది రోజులు ఉండి పోయే వ్యవహారంలో అవకతవకలు జరిగితే ఉద్యోగాలు పోతాయన్న భయం వారిని వెంటాడుతోంది. రికవరీ రేట్ ఎక్కువగా ఉన్న సంఘాల్లో కూడా రుణాలు ఇవ్వకపోవటం దారుణమని పలువురు జిల్లా సహకార అధికారికి లేఖలు రాశారు.

రాజధాని రైతులకు రుణాలు లేవు

రాజధాని అమరావతి ప్రాంతంలోని రైతులకు పంట రుణాలు పూర్తిగా నిలిపివేశారు. పూలింగ్ కు పోని భూముల్లో సాగు పనులు జరుగుతున్నాయి. అయినా బ్యాంకులు తమకు రుణాలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదంటున్నారు.

ఎప్పుడూ లేనిది సార్వత్రిక ఎన్నికలకు ముందు, తరవాత రాజ్యాంగంపై విపరీతమైన చర్చలు జరుగుతున్నాయి. కారణం ఒక పార్టీ అధికారంలోకి వస్తే, కొనసాగితే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ.... విపక్షాలు పెద్దఎత్తున ప్రచారంలోకి తెచ్చాయి. మరి రాజ్యాంగాన్ని మార్చడం అంత సులభమా. ఆర్టికల్ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ ఆర్టికల్‌లో నిజంగా రాజ్యాంగంలోని ఏ అంశాన్నైనా సవరించచవచ్చా? ఈ మాట విన్నప్పుడల్లా ఏదో తెలియని అలజడి. సమాజాన్ని అంతా కదిలించిందని అనేక వార్తలు పత్రికల్లో ప్రస్ఫుటిస్తున్నాయి. దీని గురించి స్పష్టతనిచ్చే ఏదైనా అంశం ఉందా అని పరిశీలిస్తే మనకు కనపడేది ఒకే ఒక్క ఆశాకిరణం అదే 'రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం.

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



రాజ్యాంగంలో ప్రాథమిక(మౌలిక) నిర్మాణం అనే భావన ప్రస్తావించలేదు. ఈ సిద్ధాంతం సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఉద్భవించింది. కాబట్టి ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం అనేది భారతీయ న్యాయసూత్రం. భారత రాజ్యాంగం కొన్ని ప్రాథమిక లక్షణాలను కలిగి ఉంది. వీటిని పార్లమెంటు సవరణల ద్వారా మార్చలేం. లేదా నశింపచేయలేం. రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలతో విభేదించే లేదా మార్చడానికి పార్లమెంటు ద్వారా రూపొందించిన రాజ్యాంగ సవరణ చట్టాలను సమీక్షించడానికి, కొట్టివేయడానికి సుప్రీంకోర్టుకు గల అధికారం ఈ సిద్ధాంతానికి ఆధారం. అయితే ప్రకరణ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏదైనా భాగాన్ని సవరించవచ్చు అన్న పరిమితులు లేని పార్లమెంటుకు గల అధికారాన్ని పరిమితం చేస్తూ, తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలను పేర్కొంటూ, ఈ రాజ్యాంగ మౌలిక లక్షణాలను మాత్రం స్పృశించరాదంటూ(సవరించరాదంటూ) పార్లమెంటుకు కొన్ని పరిమితులను, హద్దులను ఏర్పాటుచేస్తూ న్యాయవ్యవస్థ తన తీర్పుల ద్వారా రూపొందించిన సిద్ధాంతమే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ద్వారా సుప్రీంకోర్టు, రాజ్యాంగం పవిత్రతను, రాజ్యాంగ స్వభావాన్ని పరిరక్షిస్తోంది. అందుకోసం రాజ్యాంగం తనకు కల్పించిన అధికారంతో పార్లమెంటు రాజ్యాంగ మౌలిక వ్యతిరేక రాజ్యాంగ సవరణ చట్టాలను తన తీర్పులతో ఖండిస్తూ వస్తోంది. రాజ్యాంగ ప్రాథమిక ఆదర్శ భావాలను తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలోకి తెస్తూ మౌలిక నిర్మాణ సిద్ధాంతాన్ని విస్తరింపచేస్తూ ఉంది.

మౌలిక, స్వరూప సిద్ధాంత పరిణామక్రమం

కేశవానంద భారతి కేసు(1967)లో సుప్రీంకోర్టు పార్లమెంటుకు 368వ ప్రకరణ కింద ప్రాథమిక హక్కులను సవరించే అధికారం లేదని, రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే అలాంటి అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పును అధిగమించడానికి పార్లమెంటు 24వ రాజ్యాంగ సవరణ(1971)ను చేసింది. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ చట్టాలు ప్రకరణ 13(2) కింద చెల్లవని ప్రకటించడానికి వీల్లేదు. అయితే కేశవానంద భారతి కేసు(1973)లో 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, కానీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' మార్చే అధికారం మాత్రం లేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పులోని ప్రధానాంశాలను పరిశీలిస్తే పార్లమెంటుకు ఉన్న సవరణ అధికారాలపై అంతర్గతమైన, కనిపించని పరిమితిని ధర్మాసనం విధించినట్లు తెలుస్తుంది. ఈ తీర్పునే రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని ప్రవచించిన కేసుగా ప్రస్తావిస్తున్నారు.

కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు. అవి-

- రాజ్యాంగ ఆధిక్యత ● ప్రవేశిక
- ప్రజాస్వామ్య, గణతంత్ర ప్రభుత్వం
- రాజ్యాంగపరంగా లౌకిక స్వభావం
- శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య అధికార పృథక్కరణ ● సమాఖ్య లక్షణం
- భారతదేశ సార్వభౌమాధికారం, ఏకత్వం
- ప్రజాసామ్యబద్ధమైన రాజకీయ వ్యవస్థ కలిగి ఉండటం
- వైయక్తిక స్వేచ్ఛ

ఇందిరాగాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసు(1975)

ఈ కేసులో భారత రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు.

- భారతదేశం ఒక సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం
- సమాన హోదా అవకాశాలు ● లౌకికత్వం
- అంతరాత్మ స్వాతంత్ర్యం ● సమన్యాయం

మినర్వా మిల్స్ కేసు(1980)

కేశవానంద భారతి కేసు తీర్పు తరవాత పార్లమెంటు 42వ రాజ్యాంగ సవరణ(1976) ద్వారా ప్రకరణ 368కి 4, 5 క్లాజులను చేర్చి న్యాయసమీక్షాధికారాన్ని తగ్గించడం ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. అయితే సుప్రీంకోర్టు మినర్వా మిల్స్ కేసులో ప్రకరణ 368కి చేర్చిన 4, 5 క్లాజులు చెల్లవని తీర్పుచెప్పి రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసి తన ఉనికిని సగౌరవంగా చాటుకుంది.

వామన్‌రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1981)

ఈ కేసులో కూడా మౌలిక నిర్మాణ సూత్రాన్ని సుప్రీంకోర్టు మరోసారి నొక్కిచెప్పింది. మౌలిక నిర్మాణం అనే భావన 24 ఏప్రిల్ 1973(కేశవానంద భారతి కేసు తీర్పు) తరవాత జరిగిన అన్ని రాజ్యాంగ సవరణ చట్టాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీర్‌లో కాంట్రాక్ట్ వర్క్స్ రద్దుకు సంబంధించి దాఖలైన కేసులో జమ్మూకాశ్మీర్, లడ్డాఖ్ హైకోర్టు వ్యాఖ్యానిస్తూ... ఆర్టికల్ 21 కింద హామీ ఇచ్చిన జీవించేహక్కు అండ్ స్వేచ్ఛహక్కు; ఆర్టికల్ 19(ఐ)(జి) ప్రకారం హామీ ఇచ్చిన వాణిజ్యం లేదా వ్యాపారాన్ని కొనసాగించే హక్కు తప్పనిసరిగా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఏర్పరుస్తుందని, పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా కూడా రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని తారుమారుచేయడం సాధ్యం కాదని 29 జూలై 2024న కోర్టు పేర్కొనడం గమనార్హం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

- కిహోటో హోలోహన్ వర్సెస్ జుచిల్లు కేసు(1992): ఈ కేసులో ప్రాథమిక నిర్మాణ లక్షణాలకు స్వేచ్ఛ, న్యాయమైన ఎన్నికలు జోడించారు.
- ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1992): ఈ కేసులో 'రూల్ ఆఫ్ లా'ను ప్రాథమిక లక్షణంగా పేర్కొంది.
- ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1994): ఈ కేసులో సమాఖ్య నిర్మాణం, భారతదేశ ఐక్యత, సమగ్రత, లౌకికవాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం, న్యాయసమీక్ష ప్రాథమిక లక్షణాలుగా పునరుద్ఘాటించింది.
- ఐఆర్ కొయల్హో వర్సెస్ తమిళనాడు కేసు(2007): ఈ కేసులో కేశవానంద భారతి కేసులో తీర్పు వెలువడిన తరవాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగబద్ధతను న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చని పేర్కొన్నారు.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

రీజనింగ్

1. ముగ్గురు స్నేహితులు సినిమాకి వెళ్లాలనుకున్నారు. సాగర్ "నేను శుక్రవారం, శనివారం, సోమవారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. మరో స్నేహితుడు సందీప్ "నేను బుధవారం, శుక్రవారం, ఆదివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. ఇంకొక స్నేహితుడు శ్రీకర్ "నేను సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. అయితే వారు ముగ్గురు ఏ రోజున సినిమాకు వెళ్లడానికి సాధ్యమవుతుంది.

ఎ) గురువారం బి) శుక్రవారం
సి) ఏరోజు సాధ్యం కాదు డి) చెప్పలేం.

సమాధానం: (సి)

వివరణ: సాగర్ అందుబాటులో ఉండే రోజులు శుక్ర, శని, సోమ వారాలు. సందీప్ అందుబాటులో ఉండే రోజులు బుధ, శుక్ర, ఆది వారాలు. శ్రీకర్ అందుబాటులో ఉండే రోజులు సోమ, గురు శని వారాలు

ముగ్గురుస్నేహితులకు కామన్‌గా ఏ రోజు అందుబాటులో లేదు. కావున ఏ రోజు సాధ్యంకాదు అనేది సమాధానం అవుతుంది.

2. ఆకాశ్ ప్రతి రోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరే సమయం కంటే ఈరోజు 15 ని.లు ముందు బయలుదేరాడు. ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.లు సమయం అవసరం. ఈరోజు ఆకాశ్ బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఎ.ఎం. అని అతను ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఏ సమయంలో బయలుదేరేవాడు?

ఎ) 8.30 ఎ.ఎం. బి) 8.45 ఎ.ఎం.
సి) 8.15 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: ఆకాశ్ ఈరోజు బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.ల సమయం అవసరం అనగా ఈరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన సమయం 8.40-10=8.30 ఎ.ఎం. ప్రతిరోజు కంటే ఈరోజు 15 ని.ల ముందు బయలుదేరాడు. అనగా దీని అర్థం ప్రతిరోజు, ఈరోజు కంటే 15 ని.ల ఆలస్యంగా బయలుదేరతాడని అర్థం. కావున ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఆకాశ్ బయలుదేరు సమయం 8.30+15=8.45 ఎ.ఎం.(ప్రతిరోజు 8.45 ఎ.ఎం.కి బయలుదేరితేనే కదా ఈ రోజు 15 ని.లు ముందుగా అనగా 8.30 ఎ.ఎం. అయ్యేది.)

3. ఒక మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.లు ముందు వచ్చారు. ఈయన అతిథుల కంటే 15 ని.లు ఆలస్యంగా వచ్చారు. అతిథులు సమావేశ సమయం కంటే 5 ని.ల ముందు ఉన్నారు అయితే ఏ సమయంలో సమావేశాన్ని నిర్వహించవచ్చు?

ఎ) 10.15 ఎ.ఎం. బి) 10.20 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (సి)


వివరణ: మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.ల ముందు వచ్చారు. అనగా మంత్రి చేరుకొన్న సమయం 11.00-20=10.40 ఎ.ఎం. ఆయన అతిథుల కంటే 15 ని.ల ఆలస్యంగా వచ్చారు అనగా దీని అర్థం అతిథులు, మంత్రిగారి కంటే 15 ని.ల ముందుగానే ఉన్నారు. కావున అతిథులు వచ్చిన సమయం 10.40 - 15 ని.లు = 10.25 ఎ.ఎం. అతిథులు సమావేశానికి 5 ని॥ ముందుగానే ఉన్నారు. అనగా 5 ని॥లలో సమావేశం ప్రారంభమవుతుందని అర్థం. కావున సమావేశ సమయం 10.25 + 5 = 10.30 సమాధానం అవుతుంది.

4. ఇంటర్వ్యూను నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు వచ్చారు. అయితే ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించవచ్చు?

ఎ) 11.00 ఎ.ఎం. బి) 11.10 ఎ.ఎం.
సి) 10.50 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. అనగా మేనేజింగ్ డైరెక్టర్ వచ్చిన సమయం 10.30 - 15 = 10.15 ఎ.ఎం. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందుగానే ఉన్నాడు. అనగా దీని అర్థం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కంటే 20 ని.ల ఆలస్యంగా వచ్చారని తెలుస్తున్నది. అనగా చైర్మన్ వచ్చిన సమయం 10.15+20=10.35 ఎ.ఎం. ఆయన ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు ఉన్నాడు. అనగా ఆయన వచ్చిన 25 ని.ల తరవాత



ఇంటర్వ్యూ జరుగుతుందని అర్థం. కావున ఇంటర్వ్యూ నిర్వహించే సమయం 10.35+25 ని.లు = 11.00 ఎ.ఎం. సమాధానం అవుతుంది.

5. ఒక రైలు విజయవాడకు ప్రతి గంటకు ఉంది. విచారణాధికారి(ఎంక్వైరీ క్లర్క్) తనను కలిసిన ప్రయాణికులతో రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయినది. తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?

ఎ) 10.20 ఎ.ఎం. బి) 10.15 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం:(బి)

వివరణ: ప్రశ్నలో రైలు ప్రతి గంటకు ఉంది తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని ఇచ్చారు. అనగా దాని ముందు రైలు సమయం 10.00 ఎ.ఎం. విచారణాధికారి (ఎంక్వైరీ క్లర్క్) రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయిందని చెప్పారు. అనగా దీని అర్థం ప్రయాణికుడు 15 ని.ల ఆలస్యంగా వచ్చాడు (ఆలస్యంగా వస్తేనేగా రైలు వెళ్ళిపోయింది) కావున విచారణాధికారికి, ప్రయాణికుడికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.00 + 15 ని॥ = గం॥ 10.15 ని.లు సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి

కొత్త లుక్‌లో



క్లాస్ లుక్‌లో సింపుల్‌గా చిరునవ్వుతో కనిపించే మహేశ్‌బాబు ఈసారి సరికొత్త లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన పోనీటెయిల్, గుబురుగడ్డంతో ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళితో చేస్తున్న చిత్రం కోసమే మహేశ్ ఈ కొత్తలుక్‌లోకి మారారని టాక్. ఇటీవలే మహేశ్‌బాబు తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలసి విహార యాత్రకు రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు జైపూర్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త లుక్‌లో కనిపించారు.

డబుల్ ఇంపాక్ట్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం చిత్రబృందం డబుల్ ఇంపాక్ట్ పేరుతో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. వరుణ్‌తేజ్ యువకుడిగా, మధ్య వయస్కుడిగా రెండు విభిన్న గెటప్పుల్లో అలరించారు. వింటేజ్ లుక్‌లో సిగార్ తాగుతూ కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో మాఫియా లీడర్ పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

రెండింతల వినోదంతో వస్తున్నాం

- పూరి జగన్నాథ్



'రామ్ పోతినేని లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు. డబుల్ ఎనర్జీతో ఈ సినిమా చేశాడు. సంజయ్‌దత్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకార్షణ. రామ్ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. సినిమాను బ్లాక్‌బస్టర్ చేయండి' అని దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రేక్షకులను కోరాడు. ఆయన దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ "ఇస్మార్ట్ శంకర్‌కు మించేలా 'డబుల్ ఇస్మార్ట్' ఉంటుంది. పూరి జగన్నాథ్ గన్ లాంటివారు. గన్ బావుంటే బుల్లెట్ ఎంత ఫోర్స్‌తో అయినా వెళుతుంది. పూరి గారి లాంటి గన్ అందరి యాక్టర్స్‌కి కావాలని ఈ సినిమాతో తెలిసింది. సంజయ్‌దత్‌తో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. పాటలు ప్రజాదరణ పొందాయి, సినిమా కూడా ఘన విజయం అందుకుంటుందనే నమ్మకం ఉందన్నారు నిర్మాత ఛార్మీ కౌర్. డబుల్ కామెడీ, డబుల్ యాక్షన్, డబుల్ మ్యాజిక్‌లా సినిమా ఉండబోతోందని కథానాయిక కావ్య థాపర్ చెప్పారు.

విడాకులు... మీడియా ప్రచారమే



ఐశ్వర్యతో విడిపోతున్నట్లు వస్తున్న వదంతులపై అభిషేక్ బచ్చన్ ఎట్టకేలకు స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కొన్ని ఆసక్తికర వార్తల కోసం మీరు (మీడియా) ఇదంతా చేస్తున్నారు. మేం సెలబ్రిటీలం కాబట్టి ఇలాంటి వాటి గురించి పట్టించుకోను. నేను ఇంకా వివాహ బంధంలోనే ఉన్నాను. క్షమించండి' అంటూ తన వేలికి ఉన్న నిశ్చితార్థపు ఉంగరాన్ని చూపించాడు. దీంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న అభిషేక్ తమపై వస్తున్న రూమర్లకు ప్రస్తుతానికి చెక్ పెట్టినట్లైంది. ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ గత కొంత కాలంగా ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అనంత్ అంబానీ పెళ్లికి విడివిడిగా హాజరడంతో వీరిద్దరూ నిజంగానే విడిపోతున్నారేమోనని భావించారు. ఐశ్వర్యతో విడిపోతున్నట్లు అభిషేక్ బచ్చన్ చెబుతున్న డీప్‌ఫేక్ వీడియో ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

థియేటర్లలో పెళ్ళి... మంచి పద్ధతి కాదు



థియేటర్లలో పెళ్లిళ్లు చేసుకునే పద్ధతి మంచిది కాదని దర్శకుడు కృష్ణవంశీ హితవు పలికారు. ఆయన దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం ఇటీవలే రీ రిలీజైన సందర్భంగా ఓ ప్రేమజంట థియేటర్‌లోనే పెళ్లి చేసుకుంది. నెటిజన్లు ఆ వీడియోలను కృష్ణవంశీకి ట్యాగ్ చేస్తూ షేర్ చేస్తున్నారు. దీంతో ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. 'మన సంస్కృతి, సంప్రదాయాలను కించ పరచొద్దు. నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఇలాంటి పనులు చేయకండి. అవగాహన లేక వారిద్దరూ అలా చేసి ఉంటారు. వారికి మంచి భవిష్యత్ ఉండాలి' అని ఆకాంక్షించారు.

ఖాకీ పాత్రల్లో కథానాయికలు



వెండి తెరపై ఎప్పటికీ చెదిరిపోని క్రేజ్ ఉన్న పాత్రల్లో పోలీస్ ఆఫీసర్ రోల్స్ ముందుంటాయి. హీరోలు పోషించిన పోలీస్ పాత్రలు ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలిసిందే.. అదే పాత్రను కథానాయికలు పోషిస్తే... ప్రేక్షకులను అలరించడానికి పోలీస్ ఆఫీసర్స్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న బాలీవుడ్ కథానాయికలపై ఓ సారి లుక్కేద్దాం.

లేడీ సింగం...

రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన మొదటి రెండు సినిమాలు ఎంతటి ఘనవిజయాలు అందుకున్నాయో తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంగా 'సింగం ఎగైన్' సినిమాలో దీపిక పదుకొనే పోలీస్‌గా అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 1న విడుదల కానుంది. అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, రోహిత్ శెట్టి, అర్జున్ కపూర్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



మర్డర్ మిస్టరీని ఛేదించే పాత్రలో...

అగ్ర నటి కరీనా కపూర్ ఇది వరకు 'అంగ్రేజీ మీడియమ్' సినిమాలో పోలీసాఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆమె మరోసారి 'బకింగ్‌హామ్ మర్డర్స్'లో ఖాకీ దుస్తుల్ని ధరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడిగా పేరొందిన హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఓ మర్డర్ మిస్టరీ కథాంశంతో సాగనుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది.



శత్రు సంహారానికై...

'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్, 'సుల్తాన్' సినిమాలో పోషించిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కుబ్రా సైత్. 'దేవా' సినిమాలో ఆమె శత్రుమూకల అంతు చూసే పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, పూజా హెగ్డే కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.



వెబ్ సిరీస్‌లోనూ..

వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పడ్నేకర్. ఇటీవలే క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'భక్షక్'తో ప్రేక్షకులను అలరించిన భూమి.. ప్రస్తుతం 'దల్‌దాల్' అనే ఓ వెబ్ సిరీస్‌లో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆమె ఓ సైకో కిల్లర్‌తో తలపడనున్నారు. అమ్రిత్‌రాజ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.




రెండో సీజన్ వచ్చేస్తోంది...

'దహాడ్' తొలి సీజన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజలి భాటిగా అలరించారు సోనాక్షి సిన్హా. ఎనిమిది భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ క్రైమ్ డ్రామాకు రీనా కగ్తీ, రుచికా ఒబెరాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ వర్మ, గుల్షన్, సోహమ్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ విడుదల కానుంది.



పవర్‌ఫుల్ పాత్రలో...

'కితనీ మొహబ్బత్ హై' సీరియల్‌తో పాపులర్ అయ్యారు నటి క్రితిక కమ్ర. ఆమె గ్యారహ్ గ్యారహ్ (11:11) అనే వెబ్ సిరీస్‌లో నటించారు. ఇటీవలే విడుదలైన ఈ ఇన్‌వెస్టిగేటివ్ డ్రామాలో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.



స్విట్జర్లాండ్‌లో జరిగిన లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్‌ను పార్డో అల్లా కారియారా పురస్కారంతో సత్కరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నటుడు షారూఖ్ కావడం విశేషం.

సరికొత్త వీక్షణం



రామ్ కార్తిక్, కశ్వి జంటగా రూపొందుతున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిమ్మ చీకటిలో బైనాక్యులర్స్ నుంచి వస్తోన్న కాంతిలో నిల్చున్న హీరో లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్

కొత్తగా...

క్రైమ్ సస్పెన్స్ కలబోతగా



విశ్వంత్, శిల్పా మంజునాథ్ జంటగా బసిరెడ్డి రానా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హైడ్ అండ్ సీక్'. నరేంద్ర బుచ్చిరెడ్డి గారి నిర్మించారు. నటుడు శివాజీ ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక వినూత్నమైన క్రైమ్ థ్రిల్లర్. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'క్రైమ్, సస్పెన్స్ అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. మా సినిమా సమర్పకుడు నవీన్ మేడారం ఫస్ట్ కాపీ చూసి బావుందని ప్రశంసించారు' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లిజో కే జోష్, సినిమాటోగ్రఫీ: చిన్న రామ్

పైసా వసూల్ ఎంటర్‌టైనర్



చిమటా రమేశ్ బాబు హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'నేను-కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమేశ్ మాట్లాడుతూ "బ్లాక్‌బస్టర్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ప్రేమ కథతో పాటు చక్కని వినోదం మేళవించి తెరకెక్కించాం. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "ఇది పైసా వసూల్ ఎంటర్‌టైనర్" అని నిర్మాత జ్యోతిర్మయి తెలిపారు.



జ్యూయలరీ షోరూం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి, సినీ తార కావ్య కళ్యాణ్ రామ్

ఒరాఫో జ్యూయలర్ షోరూం ప్రారంభం

- సందడి చేసిన బలగం సినిమా ఫేమ్ కావ్య కళ్యాణ్‌రామ్
- పాల్గొన్న గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 11: గుంటూరు నగరంలోని బ్రాడీపేట 2/4వ లైనులో ఏర్పాటు చేసిన ప్రముఖ ఒరాఫో జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, బలగం సినిమా ఫేమ్ కుమారి కావ్య కళ్యాణ్‌రామ్‌లు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీ తార కావ్య కళ్యాణ్‌రామ్ అభిమానులతో కలసి సందడిచేశారు. షోరూం డైరెక్టర్ కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ ప్రారంభోత్సవం సందర్భంగా అన్నిరకాల వెండి ఆభరణాలపై గ్రాముకు రూ.50 తగ్గింపు అందజేస్తున్నట్లు తెలిపారు. 92.5 విలువైన వెండితో నాణ్యమైన ఉత్పత్తులు అందించే లక్ష్యంతో బ్రాంచ్‌ను ప్రారంభించామన్నారు. బ్రాడీపేటలో మూడో షోరూం ప్రారంభంతో బ్రాండ్ వెండి ఆభరణాల విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. అతి త్వరలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో షోరూంలు, ఫ్రాంచైజ్ మోడల్స్‌తో ప్రారంభించే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ షాపింగ్ కోసం ఒరాఫో ఈ కామ్స్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఇలాంటి షోరూంలు మరిన్ని నగరానికి రావాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో ఆభరణాలు ఉన్నాయన్నారు.

మచిలీపట్నం, వికారాబాద్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా మచిలీపట్నం, వికారాబాద్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెంబరు. 07453 మచిలీపట్నం - వికారాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 13, 15 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 1.55కి గుంటూరు, 3 గంటలకు సత్తెనపల్లి, 3.19కి పిడుగురాళ్ల, మరుసటి రోజు ఉదయం 7.10కి సికింద్రాబాద్, 7.40కి లింగంపల్లి, 9 గంటలకు వికారాబాద్ చేరుకొంటుంది. నెంబరు. 07454 వికారాబాద్ - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 14, 16 తేదీల్లో రాత్రి 7 గంటలకు బయలుదేరి రాత్రి 11.29కి పిడుగురాళ్ల, అర్ధరాత్రి దాటాక 12.39కి సత్తెనపల్లి, 1.45కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 5.30కి మచిలీపట్నం చేరుకొంటుందని డీఆర్ఎం తెలిపారు.

రైళ్లలో ప్రయాణం భద్రమేనా?



- నరసపూర్ ఎక్స్‌ప్రెస్‌పై రాళ్లదాడి ఉదంతంతో ఉలికిపాటు
- ఆన్‌బోర్డు టీటీఈలు, ఆర్పీఎఫ్ గార్డుల సమన్వయ లోపం
- రిజర్వ్ బోగీల్లో జనరల్ ప్రయాణీకుల ప్రవేశం అనర్థమే..

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ట్రైన్ నెంబరు. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక, ఆదివారం వేకువజామునకు ముందు 2 గంటల సమయంలో జరిగిన దోపిడీయత్నం సంఘటన కలకలం రేకెత్తించింది. ఘటన రాత్రి వేళ నడికుడి మార్గంలో రాకపోకలు సాగించే రైళ్లలో ప్రయాణికుల భద్రతపై అనుమానాలను కలిగిస్తోంది. ఆన్‌బోర్డు టీటీఈలు, ఆర్పీఎఫ్‌గార్డుల మధ్య సమన్వయ లోపం కూడా ఈ విషయంలో ప్రస్ఫుటమౌతోంది. సాయుధులైన గార్డులుండి కూడా దుండగులు రైలు బోగీలపై రాళ్లు రువ్వుతుంటే తగిన రీతిలో స్పందించక పోవడం ప్రయాణీకుల భద్రతని ప్రశ్నార్థకం చేసింది.

అర్ధరాత్రివేళ గుంటూరు నుంచి నడికుడి మీదగా సికింద్రాబాద్ వైపునకు ప్రయాణించే తొలి రైలు నరసపూర్- లింగంపల్లి ఎక్స్‌ప్రెస్. ఏడాది పొడవునా ఈ రైలుకు డిమాండ్ ఉంటుంది. స్లీపర్, ఏసీ బోగీల్లో బెర్తులన్నీ బుకింగ్ అయిపోతాయి. ఇక జనరల్ బోగీలలో అయితే ప్రయాణీకులు కిక్కిరిసిపోయి ఉంటారు. జనరల్ ప్రయాణికులకు తగినన్ని బోగీలు లేకపోవడం కారణంగానూ,రిజర్వ్ బెర్తులు కన్ఫర్మ్‌కాని కారణంగాను ఆయా ప్రయాణికులు రిజర్వేషన్ బోగీల్లోకి ఎక్కేస్తుంటారు. ఆ సమయంలో ఆయా బోగీలు జనరల్ బోగీలను తలపిస్తున్నట్లు ఉంటాయి. సహజంగా అర్ధరాత్రి దాటాక ప్రయాణీకులు నిద్రకు ఉపక్రమిస్తుంటారు. ఆదివారం వేకువ జామునకు ముందు దుండగులు ఈరైలులో దోపిడీకి పథకంపన్నారు. నడికుడి-మిర్యాలగూడ మధ్యన ఊళ్లకు దూరంగా రైల్వే ట్రాక్ ఉంటుంది. దీనిని అవకాశంగా చేసుకొని పొందుగల రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే బీ5, ఎస్10, ఎస్13 బోగీలలో ప్రయాణీకుల మెడలో బంగారు ఆభరణాలు తెంచుకెళ్లేందుకు ప్రయత్నించారు. దాదాపుగా ఐదు నుంచి ఆరుగురు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మహిళ ప్రయాణీకురాలు గట్టిగా కేకలు పెట్టడంతో ఒక్కసారిగా రైలు అలారం చైన్ లాగి కిందకు దూకేశారు. ఆ సమయంలో ఆర్పీఎఫ్ గార్డులు అయుధాలు చూపించడంతో ఒక్క సారిగా బోగీలపై గులకరాళ్లతో దాడికి దిగారు. దీంతో తమను తాము రక్షించుకొనే ప్రయత్నంలో బోగీల తలుపులను మూసేశారు. దాంతో దుండగులు పారిపోయారు. ఈకారణంగా నరసపూర్ ఎక్స్‌ప్రెస్ అరగంటకుపైగా అక్కడ నిలిచిపోయింది. గుంటూరులో రాత్రి 11.20 గంటలకు బయ లుదేరిన ఈ రైలు నల్గొండ వెళ్లేసరికి 3.15 గంటల సమయం అయింది.

గతంలోనూ ఒక సారి..

కాగా గతంలోనూ పిడుగురాళ్ల - మిర్యాలగూడ సెక్షన్‌లో ఇదే తరహా దోపిడీ రైళ్లలో జరిగాయి. అప్పట్లో షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ కూడా ఆర్పీఎఫ్ జారీ చేసింది. ఇంచుమించు ఏడేళ్ల తర్వాత మళ్లీ అలాంటి సంఘటనే శనివారం చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈనేపథ్యంలో ఆన్ బోర్డు టీటీఈలు, ఆర్పీఎఫ్ సిబ్బంది గుంటూరులో జనరల్ టిక్కెట్ తీసుకొని రిజర్వుడు బోగీలు ఎక్కిరో వారిని ఆయా బోగీల నుంచి దించేయాలని ప్రయా ణీకుల వినియోగదారుల సంఘాలు సూచిస్తున్నాయి. అలానే వెయిట్‌లిస్టు ప్రయాణీకుల విషయంలోనూ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదేవిధంగా చెన్నై, విశాఖ, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లలోనూ కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నర్సాపూర్ రైలుపై రాళ్ల దాడి

దాచేపల్లి, ఆగస్టు 11: నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లతో దాడి చేసిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో నడికూడి రైల్వేజంక్షన్ సమీపంలో జరిగింది. సేకరించిన వివరాలిలా వున్నాయి. శనివారం రాత్రి గుంటూరులో బయలుదేరిన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నడికూడి దాటిన తరువాత వున్న అండర్ పాస్ పక్కనే కొంతమంది వ్యక్తులు రైల్వే ట్రాక్‌పై వున్న గుళకరాళ్లతో ఏసీ బోగిల అద్దాలపై రాళ్లు విసిరారు. దీంతో ఆ బోగీలోని ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఆ బోగీల్లోవున్న ఆర్పీఎఫ్ పోలీసులు వెపన్లు బయటకు తీసి చూపించడంతో దుండగులు పరుగులు తీసినట్లు సమాచారం. 8 ఏళ్ల క్రితం నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలుపైనా ఈ తరహా దాడి జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనపై రైల్వే పోలీసు అధికారులను సమాచారం కోరగా రాళ్లు విసిరిన మాట వాస్తవమేనని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న విధంగా రైలులో చోరీ వార్తలలో వాస్తవం లేదని, అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని అన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- పురుషుల, మహిళల విభాగాల్లో గోల్డెన్ కప్‌లు సాధించిన గుంటూరు, విజయనగరం జట్లు

వినుకొండటౌన్, ఆగస్టు 11: వినుకొండ పట్టణంలోని గుడ్‌షపర్డ్ పాఠశాల్లో గత రెండు రోజులుగా జరిగిన, రాష్ట్ర స్థాయి సాఫ్టబాల్ ఆటల పోటీల్లో పురుషులు, మహిళల విభాగంలో మొత్తం 26 జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో గుంటూరు గోల్డెన్ టీమ్‌గా విజయం సాధించగా, రెండవ బహుమతి అనంతపురం, మూడవ బహుమతి నెల్లూరు, నాల్గవ బహుమతి విజయనగరం జట్లు విజేతలుగా నిలిచాయి. సెమీఫైనల్ విభాగంలో విజయనగరం, గుంటూరు జట్లు విజయం సాధించి ఫైనల్‌కు చేరాయి. గ్రాండ్ ఫైనల్స్ పోటీలో అనంతపురం, గుంటూరు జట్లు తలపడగా, గుంటూరు జట్టు విజయం సాధించి గోల్డెన్ కప్ సాధించింది.



మొదటి స్థానంలో నిలిచి గోల్డెన్‌కప్ సాధించిన గుంటూరు పురుషుల జట్టు




మొదటి స్థానంలో నిలిచి గోల్డెన్‌కప్ సాధించిన విజయనగరం మహిళా జట్టు

మహిళా విభాగంలో గోల్డెన్ టీమ్ విజేత విజయనగరం. రెండవ బహుమతి అనంతపురం, మూడవ బహుమతి గుంటూరు, నాల్గవ బహుమతి కర్నూల్ సాధించాయి. సెమీ ఫైనల్ విభాగంలో అనంతపురం, కర్నూల్. గుంటూరు, విజయనగరం జట్లు పోటీ పడగా, ఫైనల్స్‌కు విజయనగరం, అనంతపురం చేరాయి. ఫైనల్స్ పోటీలో విజయనగరం జట్టు విజయం దక్కించుకుంది. పోటీల్లో గెలుపొందిన విజేతలకు డాక్టర్ ఇన్నారెడ్డి బహుమతులు అందచేశారు. పోటీలను నిర్వహించిన సాఫ్టబాల్ గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ నరసింహారెడ్డికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

అమ్మో.. అరటి!

- ఆకాశాన్ని అంటుతున్న గెలల ధరలు
- రూ.800 నుంచి రూ.1350 పలుకుతున్న వైనం
- ధరలను చూచి ఆశ్చర్యపోతున్న రైతులు
- శ్రావణ మాసం నేపథ్యంలో పెరిగిన డిమాండ్

కొల్లిపర, ఆగస్టు 11 : జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌లో ప్రస్తుతం అరటి గెలలు అతి తక్కువగా వస్తున్నాయి. దీనికి తోడు శ్రావణ మాసం కావటంతో అరటి గెలల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా అరటి గెలల ధరలు పలకటంతో రైతులు ఆశ్చర్య పోతున్నారు. ఈ మార్కెట్‌లో సీజన్‌లో ప్రతి రోజూ సుమారు నాలుగు వేల నుంచి ఐదు వేల వరకు అరటి గెలలు క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. అటువంటిది మేనెలలో వీచిన పెనుగాలులకు అరటి తోటలు పడిపోయాయి. దీంతో అరటి రైతులకు అపారమైన నష్టం వాటిల్లింది. అరటి తోటలు పడిపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లకు గెలలు తక్కువగా వస్తున్నాయి. ప్రతి రోజు 100 నుంచి 150 వరకు గెలలు మించి మార్కెట్‌కు రావడంలేదు.



కొల్లిపర మార్కెట్ వద్ద వేలంలో రూ .350లు పలికిన అరటి గెలలు

అరటి గెలలు మార్కెట్‌లకు తక్కువగా రావడంతో అరటి గెలల ధరలు చుక్కలంటుతున్నాయి. మార్కెట్‌లకు గెలలు అతి తక్కువగా రావడంతో పాటు శ్రావణమాసం కావడంతో వ్యాపారస్తులు కూడా పోటీపడి గెలలను కొనుగోలు చేస్తున్నారు. గతంలో మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.300 నుంచి రూ.350 వరకు, రెండవ రకం రూ.150 నుంచి రూ.200 పలికింది. చక్కెరకేళి రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలికింది. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.1000 నుంచి రూ.1350వరకు, రెండవరకం రూ.700 నుంచి రూ.800 ధరలు పలుకుతున్నాయి. మూడవ రకం కర్పూర గెల కూడా రూ.350 నుంచి రూ.400, అదే విధంగా చక్కెరకేళి మొదటి రకం రూ.350 నుంచి రూ.450 వరకు ధర పలుకుతుంది. అరటి తోటల్లో గెలలులేని సమయంలో మార్కెట్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో రైతులు విలవిల బోతున్నారు. ఎప్పుడు ఈ విధంగా అరటి గెలల ధరలు పలకడం చూడలేదని రైతులు తెలుపుతున్నారు. అరటి గెలల ధరలు అమాంతంగా పెరగటానికి కారణం అరటి పంట లేకపోవడమేనని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఈ సంవత్సరం రైతుల దగ్గర పంటవున్న సమయంలో అరటి ధరలు లేకపోవడంతో పూర్తిగా నష్టపోయారు. అరటి పంట లేని సమయంలో మార్కెట్ వేలంలో పడుతున్న అరటి గెలల ధరలను చూచి రైతులు ఆవేదన చెందుతున్నారు. అరటి గెలలకు ఒక్కసారిగా ధరలు పెరగటంతో డజను కాయలు రూ 80 నుంచి 100 రూపాయలు వరకు వ్యాపారస్తులు అమ్మటంతో వినియోగదారులు అరటి పండ్లను కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మేడికొండూరు, ఆగస్టు 11: వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మేడికొండూరు మండలం డోకిపర్రు పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో పల్నాడుజిల్లా నకరికల్లు అడ్డరోడ్డువద్ద గల ఏటూరుపేటకు చెందిన మద్దూరి రాజశేఖర రెడ్డి(27) మృతిచెందగా, కసిరెడ్డి వీర అంజిరెడ్డి తీవ్ర గాయాలపాలయ్యాడు. వీర అంజిరెడ్డిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మేడికొండూరు ఎస్ఐ చల్లా వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కారు మెకానిక్‌గా పనిచేసే రాజశేఖరరెడ్డి తన బావమరిది అయిన వీర అంజిరెడ్డితో కలసి ఏటూరుపేట నుంచి ద్విచక్ర వాహనంపై గుంటూరు వస్తున్నాడు. డోకిపర్రు సమీపంలోకి రాగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నామని తెలిపారు.

పిడుగురాళ్ల: అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై కామేపల్లి సమీపంలో వున్న వినాయకుని గుడివద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరంకు చెందిన బచ్చు సీతారామయ్య (58) ద్విచక్రవాహనంపై తన సమీప బంధువుతో కలిసి మాచవరం నుండి పిడుగురాళ్లకు వస్తుండగా దాచేపల్లి నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సీతారామయ్య మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న కపిలవాయి ఆదిలక్ష్మీకి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కారంపూడి పీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

ఒప్పిచర్లలో ప్రబలిన డయేరియా

- కారంపూడి పీహెచ్‌సీలో ఆరుగురు బాధితులు
- ఇద్దరు నరసరావుపేటకు తరలింపు

కారంపూడి, ఆగస్టు 11: మండలంలోని ఒప్పిచర్లలో డయేరియా ప్రబలుతోంది. ఆదివారం ఈ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించిన వైద్యాధికారులు ఆరుగురు డయేరియా భారిన పడినట్లు గుర్తించారు. వీరిలో గ్రామానికి చెందిన మట్టపల్లి సుబ్బమ్మ, పుల్లయ్య, మిద్దెపోగు వెన్నెల, వంకాయలపాటి సత్యం, బొడ్ల తిరుపతమ్మ, అమరావతి ఈశ్వరమ్మలు డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించిన వైద్యాధికారులు వెంటనే వారిని మండల కేంద్రమైన కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. వీరేకాక మరో నలుగురు డయేరియా లక్షణాలతో ఇబ్బంది పడుతూ గ్రామంలోని ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన డయేరియా భారిన పడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వారిని నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు. గ్రామంలో డయేరియా ప్రబలుతుండడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ డయేరియా అదుపులోకి రావడం లేదు. ఉన్నతాధికారులు మెరుగైన వైద్యసేవలు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎనిమిది క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ఎనిమిది క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 11: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఆదివారం 8 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 63,288 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 588.20 అడుగులు ఉంది. ఇది 306.69 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 741 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, 8 క్రస్ట్ గేట్ల ద్వారా 63,288 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,841 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,04,424 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,86,533 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కుడి కాలువకు నీటి విడుదల తగ్గింపు

నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా ఆదివారం అధికారులు నీటి విడుదలను తగ్గించారు. కుడి కాలువ పరిధిలోని తాళ్లపల్లి సూరమ్మచెరువు వద్ద లాకుల వద్ద నీరు లీకేజీ అవుతుండడంతో అధికారులు కుడి కాలువకు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదలను తగ్గించారు. అధికారులు సూరమ్మ చెరువు వద్దకు వెళ్లి మరమ్మతులను చేపట్టారు. మరమ్మతుల అనంతరం రాత్రి పది గంటల నుంచి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.



నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

పర్యాటకుల సందడి ..

మండలంలోని విజయపురిసౌత్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ వాహనాల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో విజయపురిసౌత్‌కు చేరుకొని జాలువారుతున్న నీటి అందాలను తిలకించారు. సెల్ఫీలు దిగుతూ సందడిచేశారు. అలాగే లాంచీ స్టేషన్ నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో నాగార్జున కొండను సందర్శించేందుకు వెళ్లారు.

బ్యారేజీ దిగువకు 2.28 లక్షల క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి టౌన్, ఆగస్టు 11: ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 2 లక్ష 34 వేల 500, కీసర వాగు నుండి 7వేల 500 క్యూసెక్కుల వంతున మొత్తం 2 లక్షల 42వేల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 5 అడుగులు, 10 గేట్లను 6 అడుగులు ఎత్తి దిగువకు 2 లక్ష 28 వేల క్యూసెక్కులు, అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 14వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రికి వరద ఉధృతి స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 11 : పులిచింల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి 1,01,555 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుండగా ప్రాజెక్టు మూడు గేట్లనుంచి దిగువ కృష్ణకు64,889 క్యూసెక్కులు, పవర్‌జనరేషన్ ద్వారా 16 వేల క్యూసెక్కులు విడుదల అవుతుంది.

నేటి నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

- జడ్పీ సీఈవో వసంతనాయుడు

గుంటూరు సిటీ, ఆగస్టు 11: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, క్లాప్ మిత్రలకు ఈ నెల 12వ తేదీ సోమవారం నుంచి 14వ తేదీ వరకు వివిధ అంశాలపై ఆయా ప్రాంతాల మండల పరిషత్తు కార్యాలయాల్లోని సమావేశమందిరాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈవో ఎన్ఎస్‌వీబీ వసంతనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి పునరుద్ధరించబడిన రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళికని ఆమోదించిన దృష్ట్యా ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ, ఏపీఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ల నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఈ శిక్షణలో ప్రతీ గ్రామ పంచాయతీలో స్థానిక పరిపాలనపై పట్టు సాధించి గ్రామ స్వరాజ్యపు కలను సాకారం చేసేందుకు అవసరమైన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా ఆదాయం పెంచుకొనేలా కార్యాచరణ, గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, అభివృద్ధి ప్రణాళికలు, 100 రోజుల కార్యచరణ ప్రణాళిక, పీఆర్-ఒన్ యాప్, విద్యుత్ పొదుపు, నిర్వహణ వంటి అంశాలపై రిసోర్స్‌పర్సన్‌లతో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణకు హాజరయ్యేవారు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



పరీక్ష నిర్వహణను పర్యవేక్షిస్తున్న జేసీ భార్గవ తేజ

రెవెన్యూ ఉద్యోగుల సర్వే పరీక్ష ప్రశాంతం

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 12వ బ్యాచ్ రెవెన్యూ ఉద్యోగులకు సర్వే పరీక్ష (థియరీ, ప్లాటింగ్) ప్రశాంతంగా జరిగింది. ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పరీక్షకు 944 మంది ఉద్యోగులు హాజరయ్యారు. వీరికి గతంలో 42 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమి ద్వారా శిక్షణ ఇచ్చారు. పరీక్షకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జూనియర్ అసిస్టెంట్‌లు, వీఆర్‌వో గ్రేడ్-1, సహాయక సెక్షన్ అధికారులు హాజరయ్యారు. వారి ఉద్యోగోన్నతికి ఈ పరీక్ష ఉత్తీర్ణత కావడం తప్పనిసరి. కాగా పరీక్ష జరుగుతున్న తీరుని జేసీ అమిలినేని భార్గవ తేజ పరిశీలించారు. ఆయనతో పాటు అకాడమి వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్, జిల్లా మైనార్టీ అధికారి మహబూబ్‌షరీఫ్, ఏడీ వై.నాగశేఖర్, అకాడమి ఏడీ ఎంవీ రంగప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94, 102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమే

● ఎస్పీ తుషార్ డూడీ


ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, ఆగస్టు 11 : తాత్కాలిక ఆనందం కోసం ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమౌతుందని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చేయరాదని, చేసే వారిని ఎట్టిపరిస్థితులలో ప్రోత్సహించరాదన్నారు. విద్యార్థులందరూ స్నేహభావంతో ఐకమత్యంగా మెలగాలన్నారు. నూతన చట్టాల ప్రకారం ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు సమర్ధవంతంగా వ్యవహరించాలన్నారు. ర్యాగింగ్ అనే మహమ్మారిని కళాశాలల నుంచి తరిమికొట్టాలన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని విద్యాసంస్థలలో ర్యాగింగ్ అరికట్టేందుకు విద్యార్థులకు, కళాశాల యాజమాన్యాలకు ఎస్పీ పలు సూచనలు చేశారు. విద్యనభ్యసించే విద్యార్థులు సీనియర్లు, జూనియర్లు అనే బేధాలు చూపకుండా స్నేహభావంతో మెలగాలన్నారు. విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి ఏదైనా కేసు నమోదైతే ఆ విద్యార్థి జీవితం అంధకారమౌతుందన్నారు. ర్యాగింగ్ చేసినా, చేయటానికి సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. కళాశాల యాజమాన్యం నిత్యం పర్యవేక్షిస్తుండాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీసు అధికారులకు తెలపాలన్నారు. ర్యాగింగ్ అనేది వికృతిచేష్ట కావున దానిని ప్రారంభంలోనే తుంచి వేయాలన్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న సీఐ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 11 : బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు నెల్లూరు బదిలీపై వెళుతూ ఆదివారం మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారిని కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. హజరత్‌బాబు కుటుంబ సభ్యులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి అమ్మవారిశేష వస్త్రాలు, వేదఆశీర్వచనాలు, అమ్మవారి చిత్రపటాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రసాదం తయారు చేసేందుకు ప్రత్యేక వంటశాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శ్రీబగళాముఖి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి

బాపట్ల రూరల్ సర్కిల్, రూరల్ సీఐలుగా హరికృష్ణ, గంగాధర్‌రావు

బాపట్ల రూరల్, ఆగస్టు 11 : బాపట్ల రూరల్ సర్కిల్ సీఐగా బి.హరికృష్ణ, రూరల్ సీఐగా కె.గంగాధరరావు ఆదివారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కృషి చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వారిని కలిసి అభినందనలను తెలిపారు.


బాపట్లరూరల్ సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న హరికృష్ణ


బాపట్ల రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న కె.గంగాధర్‌రావు

చందోలు ఎస్ఐగా స్వామిశ్రీనివాస్


చందోలు ఎస్ఐ స్వామిశ్రీనివాస్

పిట్టలవానిపాలెం, ఆగస్టు 11 : మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ ఎస్ఐగా ఆర్.స్వామి శ్రీనివాస్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ టి.అనీల్‌కుమార్ బదిలీపై చెరుకుపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్ళారు. నిజాంపట్నం నుంచి ఎన్నికల సాధారణ బదిలీలలో భాగంగా ఎస్ఐ ఆర్.స్వామి చందోలు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. మండలంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. ఎస్ఐ స్వామి శ్రీనివాస్‌కు స్టేషన్ సిబ్బంది, పలువురు అభినందనలు తెలిపారు.

నిజాంపట్నం ఎస్ఐగా తిరుపతిరావు


తిరుపతిరావు

రేపల్లె, ఆగస్టు 11 : తీరప్రాంతంలోని నిజాంపట్నం మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కందుల కృష్ణ తిరుపతి రావు అన్నారు. నిజాంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా కృష్ణ తిరుపతిరావు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు సాధారణ బదిలీలో నిజాంపట్నం రావటం జరిగిందన్నారు. గతంలో జే.పంగులూరు పోలీస్‌స్టేషన్‌లో రెండు సంవత్సరాలుగా ఎస్ఐగా విధులు నిర్వహించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జీ.శ్రీనివాసరావు వీఆర్‌కు వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం మండలం పరిసర ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్‌పై విచారించి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు.

రూరల్ సీఐని సత్కరించిన తెలుగు మహిళలు

బాపట్ల, ఆగస్టు 11 : బాపట్ల రూరల్ సీఐగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన కె.గంగాధరరావును టీడీపీ మహిళా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి మొక్క అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమవంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. గ్రామీణప్రాంతాలలో సమస్యలు తలెత్తితే సమాచారం ఇచ్చి వాటి పరిష్కారానికి సహకరించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, షేక్ నజ్మా, పద్మ, మస్తాన్‌బి, ఇందు, లుదియా, జయ ఉన్నారు.


రూరల్ సీఐ గంగాధరరావును సత్కరించి మొక్క అందజేస్తున్న టీడీపీ మహిళా నాయకులు

శ్రీబగళాముఖి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల వేలం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 11 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల బహిరంగ వేలం పాటను ఆదివారం బాపట్ల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు నిర్వహించారు. ఈ వేలం పాటలో 200 చీరలు అమ్మకాలు నిర్వహించగా రూ.48,700 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ సిబ్బంది, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసినట్లు తెలియజేశారు.


చీరలను వేలంపాటలో కొనుగోలు చేస్తున్న భక్తులు

అంగన్‌వాడీ కేంద్రానికి దారేది..?

● ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

బాపట్ల, ఆగస్టు 11 : బాపట్ల మండలం జమ్ములపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళేందుకు దారేలేకుండా పోయింది. ఓవైపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరోవైపు సచివాలయ భవనం, ముందువైపు మంచినీటి పథకం ఓవర్‌హెడ్‌ట్యాంక్ ఉన్నాయి. ఈ మూడిటికి మూలన ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్ళేందుకు అవసరమైన దారి మాత్రం లేదు. హైస్కూల్ దారి నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి రాకుండా నాడు-నేడు పనులు చేసే సమయంలో అడ్డుగా పెన్సింగ్ వేశారు. దీంతో సచివాలయ భవనం పక్కనే మరుగుదొడ్డి ట్యాంక్ పక్కగా కాలిబాటలోనే రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షం సమయంలో ఈబాట బురదగా మారటంతో కాలు జారి పడుతున్నారు. ఎంతోకాలంగా సమస్య ఉన్నప్పటికి ఏ ఒక్కరు దీనిపై స్పందించటంలేదు. ఉన్నతాధికారులు స్పందించి హైస్కూల్ బాటలో నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేవిధంగా బాట ఏర్పాటు చేస్తే బాగుంటుంది. లేకుంటే మరోదారి ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనికితోడు ఈ కేంద్రానికి మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేకపోవటం గమనార్హం. చిన్నారులు, కార్యకర్త, ఆయా దీనివల్ల ఇబ్బందులు పడుతున్నారు.


జమ్ములపాలెం హైస్కూల్, వాటర్‌ట్యాంక్, సచివాలయం మధ్య దారిలేకుండా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

300 మందికి వైద్య పరీక్షలు

భట్టిప్రోలు (కొల్లూరు) ఆగస్టు 11 : ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో భట్టిప్రోలు, అద్దేపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తెనాలి కిమ్స్ వైద్యశాల వైద్యులు కె.అనీల్‌కుమార్, కొల్లి శివరామిరెడ్డి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎముకలు, వెన్నుపూస, కీళ్ల నొప్పులు, కంటి శుక్లాలు ఉన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన టీడీపీ నాయకుడు మోసిన్ నియాజి

పిట్టలవానిపాలెం, ఆగస్టు 11 : మండలంలోని చందోలు గ్రామపంచాయతీకి చెందిన సౌత్ సెంట్రల్ రైల్వేబోర్డు మాజీ మెంబరు, టీడీపీ నాయకుడు ఎస్ఎస్ మోసిన్ నియాజి ఇటీవల విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పించాలని వినతిపత్రం ద్వారా తెలియజేశారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

గ్రామీణ విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం

● ఎస్ టూ నీడి ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్‌బాబు

బాపట్ల, ఆగస్టు 11 : గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా ఎస్ టూ నీడి ఫౌండేషన్ పని చేస్తున్నదని డైరెక్టర్ తోట సురేష్‌బాబు తెలిపారు. బాపట్ల మండలం అడవిపల్లెపాలెం గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ విద్యాకేంద్రం విద్యార్థులకు ఆదివారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సురేష్‌బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా సాయంత్రం సమయంలో అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తూ తీర ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తట్టుకొని నిలబడేవిధంగా వారిని సమాయత్త పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోగు శివ, సిరిపిల్లి సత్యవతి, పిక్కికుమార్, చోడిపిల్లి భాగ్యవతి, తిర్రి ద్రాక్షవలి, ఎరిపిల్లి కొండమ్మ, దోనిబాను, చోడిపిల్లి గురయామా, చోడిపిల్లి కాశయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్‌బాబు తదితరులు

ఆటోడ్రైవర్ భౌతికకాయానికి జనసేన నాయకుల నివాళి

కర్లపాలెం, ఆగస్టు 11 : కర్లపాలెం పంచాయతీ పరిధిలో లైబ్రరీ వెనుక నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ సవరం కన్నయ్య ఆదివారం మృతి చెందాడు. కన్నయ్య భౌతికకాయాన్ని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆదివారం సందర్శించి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమప్రగాడ సానుభూతిని తెలిపారు.


కన్నయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న నామన వెంకటశివన్నారాయణ

అంబేద్కర్ విగ్రహంపై జగన్ పేరును జనం అసహ్యించుకుంటున్నారు

● సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి

బాపట్ల, ఆగస్టు 11 : విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంలో జగన్ పేరును ఎవరో తొలిగిస్తే దానిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆపాదిస్తూ అది అంబేద్కర్ మహనీయునికి జరిగిన అవమానంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు లాంటి వాళ్ళు అవాకులు, చెవాకులు పేలటం హాస్యాస్పదంగా ఉందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈవిషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహంపై జగన్ పేరును జనం అసహ్యించుకుంటున్నారన్నారు. అంబేద్కర్ పేరు ఉన్న పథకాలకు ఆ పేరు తొలిగించి అవమానించిన నీచచరిత్ర జగన్‌దేనన్నారు. ఇలాంటి దారుణ చర్యల వల్లే అంబేద్కర్ అభిమానులు ఆయన విగ్రహంపై జగన్‌పేరు ఉండటాన్ని అసహ్యించుకుంటున్నారని కొల్లా పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

కర్లపాలెం, ఆగస్టు 11 : విజయవాడ స్మృతివనంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు సంఘవిద్రోహులు రాత్రి సమయంలో విగ్రహంపై దాడి చేశారని, వారిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, డాక్టర్ చార్వాక డిమాండ్ చేశారు. కర్లపాలెం బస్టాండ్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి చార్వాక, గుంపుల కన్నయ్య ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయటం అమానుషమని ఈ సందర్భంగా అన్నారు. ఈకార్యక్రమంలో మందపాటి పరమానంద కుమార్, అంబేద్కర్ సేవాసమాఖ్య అధ్యక్షుడు పి.ధనుంజయరావు, కాగిత కోటేశ్వరరావు, విజయరాజు, బెజ్జం వెంకటేశ్వర్లు, మల్లెల వెంకటేశ్వర్లు, మీరయ్య, రాజేష్, యిర్మియా, ధర్మేంద్ర, ఆనందబాబు, ఇమానీయేలు, బిజిలి, వందనం, బెనర్జి, పద్మరావు, యారం ఇస్సాకు, అమీర్ బేగ్, ఎ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

తెనాలి, ఆగస్టు 11 : మండల పరిధిలోని గుడివాడలో అఖిల భారత కిసాన్ సభ పిలుపు మేరకు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో వరద బాధితులకు ఆర్థిక సహాయార్థం రైతు సంఘం, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. సేకరించిన రూ.2750 విరాళాలను రైతు సంఘ రాష్ట్ర కమిటీకి పంపుతామని తెలిపారు. సీఐటీ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, ఎన్ రాజ్యలక్ష్మి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి రవికిరణ్ పంపిన ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సన్నిహితులు

మృతుడి కుటుంబానికి రవికిరణ్ ఆర్థిక సాయం

కొల్లూరు, ఆగస్టు 11 : అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వేములపల్లి రవికిరణ్ ఆదివారం ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని జువ్వలపాలెం శివారు కొత్తగూడెంకు చెందిన గాజులేటి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రవికిరణ్ వీఆర్‌కె చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. ఆ సాయాన్ని అతని సన్నిహితులు వేములపల్లి రాఘవేంద్రరావు, రత్నగోపాలరావు, కొత్తపల్లి శ్రీధర్ అందించారు. కార్యక్రమంలో పొన్నపల్లి బాబురాజేంద్రప్రసాద్, భూపతి వెంకటేశ్వరరావు, దున్నా సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు) ఆగస్టు 11 : అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు విచ్చేసిన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. ఆయా కార్యక్రమాలను సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు) ఆగస్టు 11 : అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు విచ్చేసిన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. ఆయా కార్యక్రమాలను సభ్యులు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

● గాయపడిన వాహనదారుడు

కొల్లూరు, ఆగస్టు 11 : లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం రేపల్లె నేతాజీ నగర్‌కు చెందిన చిలకా పాల్ విజయవాడ వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చిలుమూరు-ఈపూరు మధ్య కరకట్టపై ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనదారుడు గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వాహనదారుడు మద్యం సేవించి ఉన్నట్లుగా స్థానికులుచెబుతున్నారు.


లారీని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గాయపడిన వాహనదారుడు

చారిత్రక ప్రసిద్ధి గాంచిన ఆ రథాన్ని కాపాడండి

చుండూరు, ఆగస్టు 11 : చినపరిమిలో శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. భక్తులు ఈ దేవాలయానికి దూపదీప నైవేద్యాల కోసం 21 ఎకరాల భూములు అందించారు. స్వామివారికి ప్రతి ఏడాది జరిగే కళ్యాణోత్సవం రోజు గ్రామంలో రథోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారు. ఇక్కడ ఉన్న స్వామివారి రథానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆనాటి రోజుల్లోనే ఎంతో నైపుణ్యంతో కళాత్మకంగా ఈ రథాన్ని తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు ఈ రథాన్ని భక్తులు, ఆలయ అధికారులు సంరక్షించుకుంటూ దాని పవిత్రను కాపాడుకుంటూ వచ్చారు. ఇటీవల ఈ రథం ఉంచిన రథశాల కొంత శిథిలావస్థకు చేరింది. రథశాల తలుపులు దెబ్బతిన్నాయి. దీంతో ఎండ, వానలకు ఈ చారిత్రాత్మకమైన రథం దెబ్బతింటుంది. దీంతో భక్తులు దేవాలయ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విలువైన రథం దెబ్బతినకుండా రథశాలలో ఊడిపోతున్న గేట్లను బాగు చేయించి ఎండవానల నుంచి ఈ పురాతన రథం దెబ్బతినకుండా కాపాడాలని ఈ ప్రాంత భక్తులు కోరుతున్నారు.


దెబ్బతిన్న రథం గేట్లు

ఎమ్మెల్యే నరేంద్రవర్మను కలిసిన రూరల్ సీఐ

బాపట్ల, ఆగస్టు 11 : రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కె.గంగాధరరావు ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.


నరేంద్రవర్మకు మొక్క అందజేస్తున్న రూరల్ సీఐ గంగాధరరావు

కృష్ణానదిలో నిలకడగా వరద

● కరకట్ట ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె, ఆగస్టు 11 : కృష్ణానదికి వరద ఉధృతి నిలకడగా కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెనుమూడి కృష్ణానది వరద ఉధృతిని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది పుష్కరఘాట్ వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశామని ఎప్పటికప్పుడు వరద ఉధృతిపై సమాచారం తెలుసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచిస్తున్నామన్నారు. వరద ఉధృతి విపరీతంగా ఉండటంతో పర్యాటకులు వరదను చూసేందుకు తండోపతండోలుగా కదిలి వస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. కృష్ణానదిలోకి బోట్ల ద్వారా ప్రజలు ఎవరూ వెళ్ళరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కృష్ణానది కరకట్ట వెంట ఉన్న గ్రామాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ఉధృతి నిలకడగానే ఉందని, ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పెనుమూడి కృష్ణానది పుష్కరఘాట్‌వద్ద రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు

నేరెళ్ళ కాల్వను పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ

అమృతలూరు, ఆగస్టు 11 : మండలంలోని కూచిపూడి ఇరిగేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించాల్సిన ధర్నా ఉపసంహరించుకున్నట్లు రైతులు తెలిపారు. పెదరావూరు- కూచిపూడి గ్రామాల మధ్య కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు ప్రధాన కాల్వ నుంచి ప్రారంభమైన ఈ కాల్వ కూచిపూడి, మూల్పూరు గ్రామాల వ్యవసాయ భూములకు నీరందుతుంది. ఈ కాల్వ పరిధిలో నీరందటం లేదని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఫలితం లేకపోవడంతో రైతులు ధర్నాకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో 12న కూచిపూడి ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఇరిగేషన్ శాఖ ఏఈ ఉషారాణి స్పందించారు. ఆదివారం కూచిపూడి వచ్చి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సమస్యను రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. క్షేత్ర స్థాయిలో ఆమె కాల్వను పలుచోట్ల పరిశీలించారు. వెంటనే సమస్య పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారనే ధర్నాకు ఉపక్రమించామని, మా సమస్య పరిష్కారం అయితే చాలని ఆమెకు తెలిపారు.

రెవెన్యూ సదస్సులకు షెడ్యూలు ప్రకటించిన తహసీల్దార్


తహసీల్దార్ సుశీల

వేమూరు, ఆగస్టు 11 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు వేమూరు తహసీల్దార్ ఆదివారం షెడ్యూల్ ప్రకటించారు. మండల పరిధిలో 12 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించే సమయం, స్థలాలను కూడా వివరంగా ప్రకటించారు. 16న పోతుమర్రు (పులిచింతలపాలెం, 20న అబ్బనగూడవల్లి, 21న బలిజేపల్లి, 22న చదలవాడ, 23న వరహాపురం, 24న పెనుమర్రు, 28న కుచ్చెళ్ళపాడు, 29న వేమూరు, 30న చావలి, 31న పెరవలి, సెప్టెంబర్ 3న పెరవలిపాలెం, 4వ తేదిన జంపని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద జరిగే సదస్సుల్లో తహసీల్దార్‌తో పాటు మండల సర్వేయర్, వీఆర్‌వో, ఆర్ఐ, దేవదాయశాఖ అధికారి, రిజిస్ట్రేషన్ విభాగానికి చెందిన ఉద్యోగి పాల్గొంటారన్నారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలను అర్జీ ద్వారా విన్నవించుకోవాలన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని వివరించారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఈశ్వరబాబు

రేపల్లె, ఆగస్టు 11 : ఆర్యవైశ్య సంఘీయుల సమస్యలను పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు కాళేపల్లి ఈశ్వరబాబు అన్నారు. వాసవీ కల్చర్ అసోసియేషన్ కల్యాణమండపంలో రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం 2024-26సంవత్సరాలకు గాను ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు నిర్వహించారు. అధ్యక్షుడిగా కాళేపల్లి ఈశ్వరబాబు, ప్రధాన కార్యదర్శిగా తడికమళ్ళ బలరామశ్రీనివాసు, కోశాధికారిగా తూనుగుంట్ల రాజేష్, ఉపాధ్యక్షులుగా పొన్నూరు మల్లికార్జున్‌రావు, వంకాయల వెంకటరామకృష్ణ, పొన్నూరు శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శులుగా యెండూరు శివరామకృష్ణ, మానేపల్లి వెంకటసాయి, మల్లికార్జున్‌రావు, వేముల రామకోటేశ్వరరావు, అదనపు కోశాధికారిగా గుర్రం సురేష్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా మట్టుపల్లి సుబ్బారావు, మరో 27 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీ సంఘీయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరు సుబ్బారావు, గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేల సుబ్బారావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ కొమ్మూరు వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్ బొలిశెట్టి సత్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు మద్ది పద్మజ, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు పొన్నూరి గౌరీరామకుమారి, బి.నారాయణమూర్తి, ఆలపాటి వేణుగోపాలరావు, సుగ్గుల సుదర్శన్‌రావు, యెండూరు ఆదిశేషగిరిరావు పాల్గొన్నారు.


పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న కాళేపల్లి ఈశ్వరబాబు

ప్రార్ధనా మందిరం పునః నిర్మాణానికి ఆర్థిక సాయం

భట్టిప్రోలు (కొల్లూరు) ఆగస్టు 11 : స్థానిక అద్దేపల్లి ఎస్సీ కాలనీలో ఆంధ్రా క్రీస్తు లూథరన్ చర్చి పునఃనిర్మాణానికి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్ తన వంతు ఆర్థిక సాయం అందించారు. అద్దెపల్లిలో జరుగుతున్న చర్చి పునఃనిర్మాణ పనులను ఆదివారం స్థానిక నాయకులు, బీసీ సెల్ అధ్యక్షుడు మద్ది మల్లికార్జునరావు, ఎస్సీ సెల్ నాయకులు కనపర్తి సుందరరావు, ఉన్నం శ్యాంసన్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కర్ర శ్రీనివాసరావు తదితరులతో పరిశీలించారు. ఈ సందర్భంగా తన వంతు ఆర్థిక సాయం అందించారు. పాస్టర్ మదిరాల ఆనందరావు, సంఘ పెద్దలు మరియదాసు, ప్రసాద్, డేవిడ్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.


స్ట్రయిట్ కట్ వద్ద ఆందోళన చేస్తున్న మైనార్టీ ప్రతినిధులు

హంతకులను కఠినంగా శిక్షించాలి

● బాధిత కుటుంబానికి అండగా ముస్లిం నేతల ఆందోళన
● రహదారిపై బైఠాయింపు ● సర్ది చెప్పిన పోలీసులు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), ఆగస్టు 11 : జిమ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న అమీన్ ఆరీఫ్(18)పై హత్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని చీరాల పట్టణ, రూరల్ పరిధిలోని పలువురు ముస్లిం మైనార్టీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన ఆరీఫ్ హత్యతో ఆందోళన నెలకొంది. దీనిపై ఇప్పటికే ఒకసారి పలు సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ పట్టణంలో రోడ్డుపై బైఠాయించారు. ఇదిలావుండగా తిరిగి ఆదివారం రాత్రి ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ కాలువ వద్ద పెద్ద ఎత్తున చేరుకుని వాహనాలను నిలిపి వేసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ చీరాల్లో గంజాయి, మద్యం వంటి అసాంఘిక కలాపాలు జోరుగా సాగుతున్నాయన్నారు. కోడి పందేలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే ఆరీఫ్, సుచరిత, లలితమ్మ హత్యలు జరిగినట్లు పేర్కొన్నారు. దీనిపై పోలీసుల నిఘా పెంచాలన్నారు. ఆరీఫ్ కేసులోని ఇన్వెస్టిగేషన్ అధికారిని మార్చాలని డిమాండ్ చేశారు. కోడి పందేలు అరికట్టినట్లయితే ఆరీఫ్ కోడి కత్తితో మృతి చెందాల్సి ఉండేది కాదన్నారు అసాంఘిక శక్తులకు కొందరు పోలీసుల సహకారం ఉందని ఆరోపించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు కచ్చితంగా కృషి చేస్తామని సర్ది చెప్పారు.

పోలీసుల అదుపులో హంతకులు

ఆరీఫ్‌ను హతమార్చిన హంతకులలో ముగ్గురిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌లో విచారణ చేస్తున్నారు. అలాగే కేసులో మరో వ్యక్తి కోసం గాలింపు సాగిస్తున్నారు. నేడో రేపో హంతకులను అధికారికంగా అరెస్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో ఆరు బృందాలు పనిచేస్తున్నట్లు సమాచారం.


శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద మండపం విస్తరణకు వేస్తున్న పిల్లర్‌లు

శింగరకొండలో విస్తరణ పనులు ప్రారంభం

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సిద్ధమవుతున్న ముఖమండపం

అద్దంకి, ఆగస్టు 11 : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. అద్దంకి ప్రాంతంలో అతి పురాతన దేవాలయాలలో శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఒకటి. గతంలో చిన్నదిగా ఉన్న దేవాలయాన్ని జీర్ణోద్ధరణ పనులు సమయంలో 3 దశాబ్దాల కిందట ముఖ మండపం విస్తరణ చేపట్టారు. భక్తుల రద్దీ పెరుగుతుండడం తో పాటు పలు రకాల ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో దేవాలయం వద్ద భక్తులకు కొన్ని సందర్భాలలో ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ముఖ మండపాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గతంలో విస్తరణ పనులు చేపట్టిన విధంగానే సుమారు 20 నుంచి 30 అడుగుల కింద నుంచి పిల్లర్‌ల నిర్మాణం ప్రారంభించారు. దీంతో ప్రస్తుతం ఉన్న ముఖ మండపానికి అదనంగా మరో 30 అడుగుల వెడల్పు కలిసి కలిసి వచ్చి ఉత్సవాలు నిర్వహణకు ఉపయోగపడే అవకాశం ఉంది. రూ.10లక్షల దేవస్థానం నిధులు, మరో రూ.20లక్షల మ్యాచింగ్ ఫండ్‌ను దేవదాయ శాఖ కేటాయించింది. దీంతో మొత్తం రూ.30లక్షలతో ముఖమండపాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం జరుగుతుండగా, మరో మూడు, నాలుగు నెలలో పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. పనులు పూర్తయితే లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద మరింత విశాలమైన ప్రదేశం ఏర్పడనుంది. ఇప్పటికే దాతల సహాయంతో కార్యాల గది నిర్మాణం పూర్తి చేయగా, మరి కొందరు దాతల సాయంతో అన్నదాన మండపం, భక్తుల డార్మెటరీ హాల్‌ను నిర్మిస్తున్నారు. అన్ని వసతులు సమకూరితే కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కూడా భక్తులు రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవడంతో పాటు నిద్రలు చేసి మొక్కులు తీర్చుకునే వసతి సమకూరనుంది.

ఫర్నిచర్ తరలింపును అడ్డుకున్న పోలీసులు

ఇంకొల్లు, ఆగస్టు 11 : ఇంకొల్లు పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఉన్న ఫర్నిచర్ ఎవరిదనే సందేహాలు తలెత్తాయి. అక్కడున్న ఫర్నిచర్‌ను ఆదివారం తరలిస్తుండగా తెలుసున్న పోలీసులు అభ్యంతరం తెలిపారు. వైసీపీ పాలనలో అతిథి గృహానికి మరమ్మతులు చేయించి జడ్పీటీసీ సభ్యులు కార్యాలయంగా వాడుకుంటున్నారని, మరమ్మతు బిల్లులు పూర్తిస్థాయిలో అందలేదని చెప్తున్నారు. అందులో ఉన్న ఫర్నిచర్ సొంత సొమ్ముతో కొనుగోలు చేసామని, అందుకే తీసుకెళ్తున్నామని జడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి భర్త శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫర్నిచర్ ఎవరిదో తేలాక తీసుకెళ్లాలని ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో చెప్పడంతో ఫర్నిచర్‌ను తిరిగి అతిథిగృహంలో ఉంచారు.

ఆయుధాగారాన్ని పరిశీలించిన ఎస్పీ

● అధికారులకు పలు సూచనలు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 11 : జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయుధాగారని ఎస్పీ దామోదర్ ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది విశ్రాంతి తీసుకునే బ్యారక్‌లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, డీసీఆర్‌బీ సీఐ భీమానాయక్, ఆర్ఐ రమేష్ కృష్ణన్ తదితరులు ఉన్నారు.

కదులుతున్న బోగస్ డొంక!

దొంగ క్రీడా సర్టిఫికెట్‌లతో ప్రభుత్వ శాఖల్లో పలువురు తిష్ట
సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా జారీ
రూ.లక్షలు దండుకున్న పీఈటీ
ఎంబీబీఎస్ కోసమే అధికంగా విక్రయం
కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ప్రారంభమైన విచారణ
ఇదేవిషయమై క్రీడా మంత్రికి సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో బోగస్ కీడా ధ్రువీకరణ పత్రాల డొంక కదులుతోంది. దీనిపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'సాఫ్ట్‌గా దొంగాట' శీర్షికన ప్రచురితమైన కథనం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసోసియేషన్ ప్రతినిధులు, ఆ సర్టిఫికెట్‌ల ద్వారా పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న వారిలో వణుకు మొదలైంది. ఎంబీబీఎస్ సీట్ల కోసం అత్యధికంగా సర్టిఫికెట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించి సంఘప్రతినిధిగా ఉన్న ఓ ప్రభుత్వ పీఈటీ ఒక్కొక్కరి వద్ద రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ నాయకులు ఆదివారం విజయవాడ వెళ్లి క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 11 : క్రీడా సంఘం పేరుతో ఓ వ్యాయామోపాధ్యాయుడు బోగస్ సర్టిఫికెట్ల బాగోతానికి తెరతీశాడు. అందిన కాడికి దండుకున్నాడు. పదేళ్లలో మొత్తం 300 వరకూ సర్టిఫికెట్లు జారీ చేశాడు. అందులో సుమారు 150 వరకూ వైద్య విద్యార్థులకు అమ్మినట్లు తెలుస్తోంది. వాటిని సమర్పించి స్పోర్ట్ కోటాలో పలువురు ఎంబీబీఎస్ సీట్లు పొందారు. మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిపోయారు. ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ వ్యవహారం ఇప్పుడు బహిర్గతమైంది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వ పీఈటీలతో పాటు పలు క్రీడా సంఘాలు నిరసనలు చేపట్టాయి. కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రాలు కూడా సమర్పించాయి. దీనిపై స్పందించిన ఆమె ఆదేశాల మేరకు భూసేకరణ కలెక్టర్ ఝాన్సీరాణి విచారణ చేపట్టారు. అందులో అవాక్కయ్యే అనేక నిజాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది.

నిబంధనలు తూచ్!

లోధా కమిటీ నిబంధనల మేరకు క్రీడాసంఘంలో సభ్యులుగా ఒకరు నాలుగు సంత్సరాలు మాత్రమే ఉండాలి. వారు ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆయన కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఒకసారికి మించి కమిటీలో ఉండకూడదు. అయితే నకిలీ ధ్రువీకరణ పత్రాల మంజూరులో కీలకంగా వ్యవహరించిన దర్శి గురుకుల పాఠశాలలో పనిచేసే పీఈటీ 1999 నుంచి 2018 సంవత్సరం వరకూ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధిగా కొనసాగారు. అనంతరం కొన్ని సంవత్సరాలు ఆయన కుటుంబ సభ్యులు ప్రతినిధులుగా వ్యవహరించారు. ప్రస్తుతం మళ్లీ ఆయనే అసోసియేషన్‌లో కీలక పదవిలో ఉన్నారు. అంతేకాకుండా పలు క్రీడా సంఘాలను ఏర్పాటు చేశారు. పోటీలు పెట్టకుండానే నిర్వహించినట్లు చూపి క్రీడా సర్టిఫికెట్లు అమ్ముకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోటీలు నిర్వహించకుండానే సర్టిఫికెట్లు

సాఫ్ట్‌బాల్ అంతర్‌జోన్ స్థాయి క్రీడా పోటీలకు దేశంలో ఏరాష్ట్రంలోనూ సర్టిఫికెట్‌కు అర్హత లేదు. కానీ మన రాష్ట్రంలో మాత్రం సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో అంతర్‌జోన్ పోటీలు నిర్వహించినట్లు చూపి పోటీల్లో పాల్గొనని వారికి కూడా సర్టిఫికెట్‌లు మంజూరు చేశారు. వాటితో పలువురు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా, కొందరు ఎంబీబీఎస్ విద్యకు ఉపయోగించుకుని ప్రయోజనాలు పొందినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకూ అధికారులెవ్వరూ నకిలీ ధ్రువీకరణ పత్రాలపై పెద్దగా దృష్టిసారించకపోవడంతో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌లో 'మూడు నకిలీలు, రూ.ఆరు లక్షలు అన్న చందంగా' సర్టిఫికెట్ల బాగోతం కొనసాగింది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు, ఎంబీబీఎస్ సీట్లు

ఎంతో మంది విద్యార్థులకు వైద్యుడు కావాలనేది కల. ఎంబీబీఎస్ సీటు రావాలంటే కష్టపడి చదవాలి, అందుకోసం కొందరు విద్యార్థులు కొన్ని సంవత్సరాలుగా శిక్షణ తీసుకుని నీట్ పరీక్ష రాస్తుంటారు. అయితే క్రీడా సర్టిఫికెట్ ఉంటే నీట్‌లో పొందిన మార్కులకు అదనంగా స్పోర్ట్స్ కోటా కింద 2 శాతం మార్కులు కలుస్తాయి. దీని ఆధారంగా తొలిసారే ఎంబీబీఎస్ సీటు సాధించే అవకాశం ఉంటుంది. దాన్ని ఆసరా చేసుకొని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే సుమారు 150కి పైగా సర్టిఫికెట్‌లు జారీ చేశారు. వారు క్రీడలు ఆడకపోయినా డబ్బులు తీసుకొని అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చేశారు. వీటిని పొందిన కొందరు ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లుగా కొనసాగుతున్నారు. అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్న గురుకుల పాఠశాల పీఈటీ కుమారుడు, కుమార్తె ఇదే తరహా సర్టిఫికెట్లు పొంది ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఆయనకు సమీప బంధువులుగా ఉన్న మరో ఇద్దరు ప్రస్తుతం ఇవే సర్టిఫికెట్‌లతో ఎంబీబీఎస్ చదువుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అర్హులైన విద్యార్థులు కష్టపడి చదివినా కనీసం సీటు సాధించని పరిస్థితులు కనిపిస్తుండగా, నకిలీ సర్టిఫికెట్‌లతో అతి సులువుగా దొడ్డిదారిని కొందరు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. వీరితోపాటు కొందరు దొంగ సర్టిఫికెట్లతో సచివాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ సర్టిఫికెట్ల బాగోతం జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో నడిచినట్లు తెలుస్తోంది.

మంత్రిని కలిసిన పీఈటీలు, క్రీడాసంఘాల ప్రతినిధులు

జిల్లాలోని కొన్ని క్రీడాసంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయులు, పలువురు క్రీడాకారులు ఆదివారం విజయవాడ వెళ్లి రాష్ట్ర సాంస్కృతిక, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ పేరుతో సాగుతున్న అక్రమాలు, నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ సర్టిఫికెట్‌ల జారీతో అర్హులైన పలువురు నిరుద్యోగులు అర్హత కోల్పోతున్నారని విన్నవించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ నకిలీ క్రీడా సర్టిఫికెట్ల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నట్లు ఇప్పటికే తనకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశిస్తామన్నారు. ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగే కేబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఎట్టకేలకు సర్దుబాటు

విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా ప్రక్రియ
మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 11 : ఉపాధ్యాయుల సర్దుబాటుకు రంగం సిద్ధమైంది. పిల్లలు తక్కువగా ఉండి పూర్తిస్థాయి పనిభారం లేని టీచర్లను అవసరమున్న ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు ప్రక్రియను ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యా కమిషనర్ విజయరామ రాజు విడుదల చేశారు, ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు నిర్వహిస్తారు. గతంలో ఏ యజమాన్యంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను అదే పాఠశాలలకు సర్దుబాటు చేసేవారు. అయితే ప్రస్తుతం మండల, డివిజన్, జిల్లా యూనిట్‌గా ఈ నాలుగు యాజమాన్యాల్లోని పాఠశాలలకు టీచర్లను సర్దుబాటు చేస్తారు. యజమాన్యంతో సంబంధం లేకుండా ఇతర యజమాన్యాల పాఠశాలలకు కూడా టీచర్లను కేటాయిస్తారు. స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేస్తారు. ఆగస్టు 7వతేదీ నాటికి పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య యుడైస్ డేటా ఆధారంగా ఆయా పాఠశాలల్లో మిగులు టీచర్లను గుర్తిస్తారు. పాఠశాలల్లో గతనెల జూలై 31 నాటికి ఉన్న వాటినే ఖాళీ చూపిస్తారు. సర్దుబాటుకు 117 జీవోలోని విధి విధానాలనే పాటించనున్నారు. ఉపాధ్యాయులు, సంఘాలు 117 జీవోను రద్దుచేయాలని కోరుతుంటే దాని ప్రకారమే ప్రభుత్వం టీచర్లను సర్దుబాటుకు పూనుకోవడం వారికి పుండు మీద కారం చల్లినట్లు అయ్యింది.

సర్దుబాటు ప్రాధాన్యత ఇవీ

టీచర్ల సర్దుబాటు ప్రాధాన్యతలను మార్గదర్శకాల్లో వివరించారు. హైస్కూళ్లలో అన్ని సబ్జెక్టులకు కొరత లేకుండా స్కూలు అసిస్టెంట్లను నియమించడం సర్దుబాటుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉంటే 1, 2 తరగతులకు వేరుగా 3 నుంచి 8 తరగతులకు వేరుగా టీచర్లను కేటాయించనున్నారు. అన్ని పాఠశాలలకు ఎస్‌జీటీలను సర్దుబాటు చేయగా ఇంకా టీచర్లు మిగిలితే వారిని విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నారు.

వీరికి మినహాయింపు

2025 ఏప్రిల్ 30లోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇచ్చారు. 100శాతం అంధత్వం ఉన్న టీచర్లను కూడా మినహాయించారు. హైస్కూలు ప్లస్ ఇంటర్ ఉన్న పాఠశాలలను సర్దుబాటు ప్రక్రియ నుంచి తొలగించారు. వితంతువులు, అవివాహితులు, చట్టబద్ధంగా విడాకులు తీసుకున్న మహిళా టీచర్లు, స్పౌజ్ ఉన్నవారిని కూడా సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఒకవేళ వీరు బదిలీ కోరుకుంటే వారిని సర్దుబాటుకు అనుమతించనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను ప్లెయిన్ ఏరియాలకు సర్దుబాటు చేయవద్దన్నారు.

మూడు దశల్లో కౌన్సెలింగ్

పాఠశాలల్లో మిగులుగా తేలిన టీచర్లను మూడు దశల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సర్దుబాటు చేయనున్నారు. మొదటి దశలో ఎంఈఓ మండల నోడల్ అధికారిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో వచ్చే సీనియార్టీ జాబితా ప్రకారం ఎంఈఓ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మండలంలో టీచర్లు అవసరం ఉన్న పాఠశాలలను గుర్తిస్తారు. ఆ పాఠశాలలకు మిగులు టీచర్లను కేటాయిస్తారు. మండల స్థాయి కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిన టీచర్లు డివిజన్ స్థాయి కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. డివిజన్ స్థాయిలో ఉప విద్యాధికారి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అక్కడ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన టీచర్లు జిల్లా స్థాయిలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. జిల్లా స్థాయిలో డీఈఓ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. టీచర్ల సర్దుబాటులో ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలను కూడా ఎస్‌జీటీలుగానే పరిగణిస్తారు.

టీచర్ల సర్దుబాటు గడువు 12 వరకు పొడిగింపు

ఉపాధ్యాయుల సర్దుబాటు షెడ్యూల్ గడువును ప్రభుత్వం ఈనెల 12 వరకు పొడగించింది. మొదట ప్రకటించిన ప్రకారం ఈనెల 11 ఆదివారానికి సర్దుబాటు జాబితాలు సిద్ధం కావాల్సి ఉంది. అయితే శని, ఆదివారాలు రాష్ట్ర సచివాలయానికి సెలవులు కావడంతో జాబితాను సోమవారం పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ లెక్కల ప్రకారం హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్కూలు అసిస్టెంట్లు లేకపోవడంతో అక్కడ సబ్జెక్టు టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య దారుణంగా పడిపోవడంతో వేలసంఖ్యలో సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా ఉన్నారు.

రాష్ట్రంలో సబ్జెక్టు టీచర్లు 17వేలకుపైగా అవసరం కాగా కేవలం 8వేల మంది సబ్జెక్టు టీచర్లు మాత్రమే మిగులుగా తేలుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 20వేలకుపైగా సెకండరీ గ్రేడ్ టీచర్లు మిగులుగా తేలుతుండగా కేవలం ఐదువేల మంది ఎస్‌జీటీలు మాత్రమే అవసరం ఉంది. మునిసిపల్ హైస్కూళ్లలో కూడా టీచర్ల కొరత ఉంది. మొత్తంగా సోమవారం సాయంత్రానికి సర్దుబాటుకు సంబంధించి తుదిరూపు రానుంది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న స్కూటీ

● అపస్మారక స్థితిలో యువకుడు

మార్టూరు, ఆగస్టు 11 : బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద గుంటూరు వైపు ముందు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడిని వెనుక వస్తున్న స్కూటీవాలా ఢీకొన్న సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఒంగోలు వైపు నుంచి ద్విచక్రవాహనదారుడు మార్టూరు వైపు వస్తుండగా, వారి వెనుక నుంచి వస్తున్న స్కూటీవాలా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీని నడుపుతున్న కుంచాల శ్రీను అనే యువకుడు రోడ్డుపై అపస్మారకస్థితిలో పడిపోయాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మండలంలో కోనంకి గ్రామానికి చెందిన భార్యాభర్తలు రమణయ్య, సునీత స్వల్పగాయాలకు గురయ్యారు. కుంచాల శ్రీనును హైవే అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అపస్మారకస్థితిలో ఉన్న కుంచాల శ్రీనుకు వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స కూడా చేయలేదు. వెంటనే హైవే అంబులెన్సులో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కూటీలో అతని పేరుతో ఆధార్ కార్డు లభించడంతో కంకిపాడు మండలం, పూనాదిపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా అంబులెన్సు సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు.


అపస్మారకస్థితిలో పడి ఉన్న యువకుడు

మళ్లీ ఓటర్ల జాబితా సవరణ

20 నుంచి ప్రక్రియ ప్రారంభం
జనవరి 6న తుది జాబితా



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 11 : ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. తదనుగుణంగా జిల్లాలో ఆ ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన చర్యలను అధికార యంత్రాంగం తీసుకుంటోంది. ఈనెల 20నుంచి ఇంటింటి సర్వేతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వచ్చే ఏడాది జనవరి 6తో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరి 1నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా కొత్త ఓటరుగా నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. బూత్‌లెవల్ అధికారులు (బీఎల్వో)లు ఇంటింటికీ వెళ్లి పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి కార్యక్రమాలు చేపట్టి అక్టోబరు 18వతేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 1,500 మంది ఓటర్లు మించకుండా అవసరమైన చోట్ల రేషనలైజేషన్ చేసేలా ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు, జీరో ఇంటి నంబర్లతో ఉన్న వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అక్టోబరు 29వతేదీన ముసాయిదా జాబితాలను ప్రకటిస్తారు. దానిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకూ స్వీకరిస్తారు. డిసెంబరు 24లోపు అభ్యంతరాలను పరిష్కరిస్తారు. జనవరి 6వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు.

భూబాధల నుంచి విముక్తి

90 రోజుల్లో సమస్య పరిష్కారం
దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
45 రోజులు రెవెన్యూ గ్రామ సదస్సులు
16 నుంచి నిర్వహణ
మండలం యూనిట్‌గా షెడ్యూల్
గత వైసీపీ పాలనలో భారీగా అక్రమాలు, ఆక్రమణలు
ప్రస్తుత సర్కారు నిర్ణయంపై బాధితుల్లో విశ్వాసం

ఒంగోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు సర్కారు నడుం బిగించింది. అందుకోసం 90 రోజుల కాల వ్యవధితో నిర్దిష్ట కార్యాచరణను చేపట్టింది. ఈనెల 15వ తేదీన లాంఛనంగా కార్యక్రమం ప్రారంభమవుతుంది. 16 నుంచి 45 రోజుల పాటు గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఆతర్వాత 45 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదందాలు

గత వైసీపీ పాలనలో ఇటు రాష్ట్రంలో, ఇటు జిల్లాలో పెద్దఎత్తున భూదందాలు సాగాయి. తమకు అనుకూలంగా ఉండే అధికారులు, సిబ్బందిని నియామకం చేయించుకొని వారి అండదండలతో అనేక భూమాయలు చేశారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, దర్శి, సింగరాయకొండ, ఎర్రగొండపాలెం వంటి పట్టణాలలో విలువైన ప్రభుత్వ భూములు, వివాదాలలో ఉన్న స్థలాలను తమకు అనుకూలంగా రాయించుకున్నారు. మార్కాపురం మండలంలో భూఅక్రమాలకు అండగా నిలిచిన 11 మంది వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బందిపై వేటుపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టింది. ఒంగోలులో ఉన్నతాధికారులు వేసిన సిట్‌కు వందలాది మంది బాధితులు అర్జీలు అందజేశారు. ఇదే పరిస్థితి జిల్లా అంతటా సాగింది. చాలా చోట్ల రెవెన్యూ రికార్డులను తారుమారుచేసి ఆభూములను వైసీపీ నేతలు ఆక్రమించుకొని అసలు హక్కుదారులకు చుక్కలు చూపించారు. ఇక 22(ఏ)లో ప్రైవేటు భూములను చేర్పించడం, అనేక మందిని వేధించడం, తమకు అనేకూలంగా ఉన్న భూములను 22(ఏ) నుంచి తప్పించి వారి పేర్లపై రాయించుకోవడం చేశారు. వందల కోట్ల విలువైన భూములు ఇలా సొంతం చేసుకున్నారు. అలాగే రీ సర్వే జరిగిన గ్రామాల్లో అధికారులు హడాహుడిగా చేసిన ప్రక్రియతో వందలాది సమస్యలు వచ్చాయి.

రెండు నెలలకే భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే భూ సమస్యలపై దృష్టిపెట్టడం ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ప్రజల వద్దకు పాలన తరహాలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం 90 రోజులపాటు సాగనుంది. మండల యూనిట్‌గా గ్రామాల వారీ నిర్వహించే సదస్సులకు తహసీల్దార్‌ల నేతృత్వం వహిస్తారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ దేవదాయ, వక్ఫ్, అటవీ తదితరశాఖల అధికారులు హాజరవుతారు. 2019కి ముందు భూస్థితి, ప్రస్తుత స్థితిని వారు పరిశీలించడంపాటు రికార్డులు అందుబాటులో ఉంచుతారు. ఆలా నిర్వహించే సదస్సులో వచ్చే వినతులను మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు, భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22(ఏ) గోల్‌మాల్ తదితరాలను రిజిస్టర్లలో నమోదు చేయనున్నారు. అనంతరం వాటిని 45 రోజుల్లోపు పరిష్కరించనున్నారు. ఈ కార్యక్రమం వలన క్షేత్రస్థాయిలో జరిగిన అక్రమాలు వెలుగు చూడనున్నాయి.

యంత్రాంగం కసరత్తు

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో గ్రామ సదస్సుల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈనెల 15న లాంఛనంగా ప్రారంభంకానున్న ఈ కార్యక్రమ నిర్వహణలో కీలకమైన గ్రామ సదస్సుల షెడ్యూల్‌ను ఈనెల 13వ తేదీలోపు ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలం యూనిట్‌గా షెడ్యూల్ రూపొందించాల్సి ఉండటంలో తహసీల్దార్లు దానిపై దృష్టి సారించారు. సోమవారం కలెక్టర్, జేసీ ఇతర అధికారులు దీనిపై కిందిస్థాయి అధికారులకు సూచనలు చేసే అవకాశం ఉంది.

గోమాతల ఆక్రందన..!

- గోకులంలో గ్రాసం కొరత
- దాతల కోసం ఎదురు చూపులు
- స్థలం లేక తరచూ షెడ్ల మార్పు
- 60 ఆవులు.. 15ఏళ్లుగా నిర్వహణ
- రోజుకు రూ.10వేలపైనే ఖర్చు
- అద్దంకి కొండ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తే కష్టాలు తీరినట్టే


అద్దంకిలోని హరిహర గోకులంలో టెంట్ నీడన ఉన్న ఆవులు


స్థలం లేక గోడ పక్కన నీడన ఉన్న ఆవులు

అద్దంకి, ఆగస్టు 11 : హిందువులు గోమాతను పూజిస్తుంటారు. అయితే అలాంటి గోమాతలకే అద్దంకిలో పెద్ద కష్టం వచ్చింది. పశుగ్రాసం సరిపడా లేక ఏరోజుకు ఆరోజు దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అద్దంకి పట్టణంలో హరిహర గోకులం సొసైటీ ఆధ్వర్యంలో గోశాల నిర్వహిస్తున్నారు. సుమారు 15 సంవత్సరాల క్రితం ఒక్క ఆవుతో గోనుగుంట సుబ్బారావు గోశాలను ఇంట్లోనే ప్రారంభించారు. అనంతరం ఒక కపిల గోవు దూడను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దశాబ్దకాలం కిందట ఉచితంగా ఇచ్చారు. ఆ దూడ సంతతి ప్రస్తుతం ఆరు ఉన్నాయి. అప్పటి నుంచి దాతలు పలువురు ముందుకు వచ్చి ఆవులను గోశాలకు ఇస్తున్నారు. ప్రస్తుతం 60కిపైగా ఆవులు గోకులంలో ఉన్నాయి. గోవులు పెరుగుతుండటంతో పశు గ్రాసం భారం కూడా రోజు రోజుకు పెరుగుతుంది. రోజు కు సరాసరిన 10 వేల రూపాయల పశుగ్రాసం అవసరం అవుతుంది. దీంతో దాతల సహకారం మరింత అవసరం అయింది. ప్రధానంగా రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చి అద్దంకిలో వ్యాపారులు, వివిధ పనులు చేసుకుంటున్న యువకులు తరచూ సహకారం అందిస్తుండగా, అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్యులు నాగసూరి సత్యనారాయణ, అద్దేపల్లి అశోక్ తదితరులు కొంతమేర సహకారం అందిస్తున్నారు. అయితే 60కి పైగా గోవులు ఉండడం, గ్రాసం కోసం బయటకు వెళ్లే అవకావం లేకపోవడంతో ఖర్చు మరింత పెరిగింది. దీంతో ఏ రోజు కారోజు పశు గ్రాసం కోసం దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల రెండు రోజుల పాటు పశుగ్రాసం లేక గోవులు ఖాళీ కడుపుతో ఉండి అలమటించిన సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసం అందిస్తేనే గోవుల కడుపు నిండే పరిస్థితి నెలకుంది. తొలుత ఇంటి వద్దనే గోశాల నిర్వహించిన సుబ్బారావు గోవులు పెరగడంతో కొంతకాలం రామ్‌నగర్‌లో మూత పడ్డ మిల్‌లో నిర్వహించారు. అక్కడ ఖాళీ చేయించడంతో రెండు సంవత్సరాలుగా వాసవీ నగర్‌లోని విశ్వభారతి స్కూల్ ఎదురు మూతపడి ఉన్న మిల్‌లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ మిల్ కూడా ఖాళీ చేయాల్సి రావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ప్రయత్నంలో ఉన్నారు. శింగరకొండ సమీపంలో అద్దంకి కొండ వద్ద పలు విద్యా సంస్థలు, టిడ్కో ఇళ్ల, ఇతర అవసరాలకు స్థలాల కేటాయింపు జరిగిన క్రమంలో గోశాలకు కూడా కొంత మేర స్థలాన్ని కేటాయిస్తే శాశ్వతంగా గోశాల నిర్మాణం చేపట్టడంతోపాటు సమీపంలో కొండ ప్రాంతం ఉన్నందున పగలు సమయంలో మేతకు కొండకు తోలుకుపోతే పశుగ్రాసం బాధలు, ఖర్చు కూడా ఎక్కువ భాగం తగ్గుతుందని గోశాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు. గోవుల పెంపకంపై ఒకింత ఆసక్తి ఉన్న విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించి గోశాల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేయాలని, అదే సమయంలో దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసం అందించాలని సుబ్బారావు కోరుతున్నారు.

స్థలం కేటాయిస్తే శాశ్వత గోశాల నిర్మాణం



శింగరకొండ సమీపంలోని అద్దంకి కొండ వద్ద ప్రభుత్వం స్థలం కేటాయిస్తే శాశ్వతంగా గోకులం ఏర్పాటు చేసుకుంటాము. ప్రస్తుతం ఖాళీ గా ఉన్న మిల్లులలో గోశాలలను నిర్వహిస్తూ తరచూ మారాల్సి వస్తుంది. ఆ వులను మేత కోసం బయటకు వదిలే అవకాశం లేక కట్టివేసి మేపాల్సి రావటం తో గ్రాసం ఖర్చు కూడా బాగా పెరిగింది. అద్దంకి కొండ వద్ద అయితే గ్రాసం ఖర్చు బాగా తగ్గుతుంది. ఆవు లు కూడా ప్రశాంత వాతావరణ లో మరింత ఆరోగ్యం గా ఉంటాయి.

- గోనుగుంట సుబ్బారావు, గోశాల నిర్వాహకుడు, అద్దంకి

గ్రాసం లేక ఆవులు ఖాళీ కడుపుతో ఉండడం బాధేస్తోంది



గోశాలలో ఉన్న ఆవులు కొన్ని రోజులు మేత లేక ఖాళీ కడుపులతో ఉంటుండటం తీ వ్రంగా కలిచి వేస్తుంది. దీంతో తమ వంతు సహకారం అందిస్తున్నాము. అయితే ఎక్కువ గోవులు ఉండటంగో ఖర్చు ఎక్కువ గా ఉంది. మరి కొంత మంది దాతలు ముందుకు వస్తేనే ఆవు లకు కడుపు నిండా మేత అందే పరిస్థితి ఉంది.

- అజయ్, అద్దంకి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

జీవాల కాపరులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 11 : గొర్రెలు, మేకల జీవాల కాపరులకు ఎల్లప్పుడూ అండగా ఉండి, ప్రభుత్వ పరంగా చేయూతనందిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య భరోసా ఇచ్చారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఏపీ గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవాల పెంపకందారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. అందుకు ప్రభుత్వపరంగా అందిస్తున్న చేయూతను వివరించారు. భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వంతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఎరికి ఏ అవసరం వచ్చినా తనను నేరుగా కలవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పెంపకందారుల సంఘ ప్రతినిధులు, కాపరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

గొల్లపాలెంలో ఆదివారం గొల్లప్రోలువారి దేవర కొలుపుల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

పంగులూరు, ఆగస్టు 11 : పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తానికొండ రమేష్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు మూడురోజుల పాటు జరిగే కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు, పారిశుధ్యంపై అవగాహన, ఎల్ ఈడీ లైట్ల ఏర్పాటు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా పాల్గొనాలని రమేష్ కోరారు.

ఎస్‌ఐగా రత్నకుమారి బాధ్యతల స్వీకరణ



యద్దనపూడి (మార్టూరు), ఆగస్టు 11 : యద్దనపూడి మండల స్టేషన్ ఎస్‌ఐగా డీ రత్నకుమారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ ఆమె ఇక్కడ ఎస్‌ఐగా పనిచేశారు. అద్దంకి నుంచి బదిలీపై ఆమె యద్దనపూడికి వచ్చారు.

ఇంకొల్లు సీఐగా రమణయ్య



ఇంకొల్లు, ఆగస్టు 11 : ఇంకొల్లు సర్కిల్ సీఐగా వైవీ రమణయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గంజా యి, పేకాట కట్టడికి కోసం కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఎస్‌ఐగా సురేష్



ఇంకొల్లు : ఇంకొల్లు ఎస్‌ఐగా జీ సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వేటపాలెం ఎస్‌ఐగా పనిచేస్తూ ప్రస్తుతం బదిలీపై ఇంకొల్లుకు వ చ్చారు. నేరాల నియంత్రణకు కలిసి పనిచేద్దామని సిబ్బందికి పిలుపునిచ్చారు.

చినగంజాంకు రమేష్



చినగంజాం, ఆగస్టు 11 : చినగంజాం ఎస్‌ఐగా ఎస్. రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పర్చూరులో పని చేస్తూ బదిలీపై చినగంజాం పోలీ సు స్టేషన్‌కు వచ్చారు. చినగంజాం ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బాప ట్ల వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రమేష్‌కు పోలీ సు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కారంచేడుకు వెంకట్రావు



కారంచేడు(పర్చూరు), ఆగస్టు 11 : కారంచేడు ఎస్‌ఐగా వీ వెంకట్రావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బాపట్ల వీఆర్‌లో విధులు నిర్వహిస్తూ కారంచేడు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సురేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంకట్రావుకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రత్యేక దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

మేదరమెట్లకు రఫి



మేదరమెట్ల, ఆగస్టు 11 : మేదరమెట్ల ఎస్‌ఐగా షేక్ మహమ్మద్ రఫీ ఆదివారం బాధ్యతులు సేకరించారు. బాపట్ల జిల్లా చూండూరు పోలీస్‌స్టేషన్ నుం చి బదీలీపై మేదరమెట్ల పోలిస్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ ఏ చంద్రశేఖర్ బదిలీపై ఈపురుపాలెం పోలీస్‌స్టేసన్‌కు వెళ్లారు. ఎస్‌ఐ రఫి మాట్లాడుతూ ఫిర్యాదుదారులు, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామని చెప్పారు. శాంతిభదత్రలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించా రు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు వైద్య సేవలు

ఇంకొల్లు, ఆగస్టు 11 : ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం బిగ్‌టీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ,షుగర్,గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసారు.ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ నీలం మోహనారున్, డాక్టర్ షేక్ హసీనా పాటు పలువురు వైద్యులు పాల్గొని వైద్య సేవలందించారు.

రేపు వ్యాపారులకు శిక్షణ

ఇంకొల్లు, ఆగస్టు 11 : ఆహార భద్రత స్టాండర్డ్స్ అథారటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు వ్యాపారస్తులు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలని ఫుడ్‌సేఫ్టీ ట్రేనింగ్ సర్టిఫికేషన్ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు సురేంద్ర ఒక ప్రకటనలో కోరారు. ఈనెల13వ తేదీన జిల్లాస్థాయి శిక్షణ తరగతులు ఇంకొల్లులోని వాసవీ కల్యాణ మండపంలో జరుగుతాయని వ్యాపారులు శిక్షణకు హాజరై ఆహార భద్రతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. జిల్లా గెజిటెడ్ అధికారి దేవ రాజు, జిల్లా ఆహారభద్రతాధికారి ప్రణీత్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

గేదెల అదృశ్యంపై ఫిర్యాదు

కారంచేడు (పర్చూరు), ఆగస్టు 11 : పొలానికి మేతకు వెళ్లిన మూడు గేదెలు అదృశ్యం కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కారంచేడు మండలం రంగప్పపాయుడువారిపాలెంకు గ్రామంలోని కె.హరిబాబుకు చెందిన రూ.3లక్షల విలువైన గేదెలు మాయమయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కన్పించకపోడంతో కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రానైట్ కార్మికుడు మృతి


మనోజ్ (ఫైల్)

బల్లికురవ, ఆగస్టు 11 : బల్లికురువ మండలం వేమవరం గ్రామ పరిధిలోని ఓగ్రానైట్ ఫ్యాక్టరీలో శనివారం రాత్రి నిద్రలోనే అపస్మారకస్థితిలోకి వెళ్లి ఒడిసా రాష్ట్రానికి చెందిన మనోజ్ కుమార్ (34) మృతి చెందారు. అందిన సమాచారం మేరకు ఒడిసాకు చెందిన కార్మికుడు మనోజ్ కుమార్ ఐదు ఏళ్ల నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. నిద్రిస్తుంగా ఒక్కసారిగా గుండె పోటు గ్యాస్ వచ్చి వాంతులు చేసుకోగా పక్కనే ఉన్న కార్మికులు గుర్తించి మార్టూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే కార్మికుడు మృతి చెందాడు. వీఆర్వో పూర్ణిమ కార్మికుడు మృతి చెందిన వార్త తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మనోజ్ బంధువులకు కూడా సమాచారం అందించారు.


నీమాస్త్రంను తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు

చినగంజాం, ఆగస్టు 11 : సేంద్రియ సాగు పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయం ఎల్-1 జయమ్మ అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో మహిళా రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో నీమాస్త్రం తయారీపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నీమాస్త్రం అన్ని రకాల పురుగు లార్వాలను, రసం పీల్చే పరుగులను, గొంగళి పురుగులను నివారిస్తుందని జయమ్మ తెలిపారు. పది కేజీల వేపాకులను మొత్తగా రుబ్బి, డ్రమ్ములో 200 లీటర్ల నీరులో ఆ ముద్దను కలపాలని, దానికి పది లీటర్ల ఆవు మూత్రం కలిపి దానికి రెండు కేజీల ఆవు పేడను కలపాలని అన్నారు. పంట విత్తిన 20రోజుల నుంచి ప్రతి 15 రోజులకు ఒక్కసారి పంటకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని అన్నారు. దీని వలన తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పండించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు




సీఐకి శుభాకాంక్షలు చెప్తున్న టీడీపీ నాయకులు

ఇంకొల్లు, ఆగస్టు 11 : సీఐ రమణయ్య, ఎస్‌ఐ సురేష్‌ను టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టౌన్ అధ్యక్షుడు మార్క్, కరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, గంగవరం మాజీ సర్పంచ్ బొడెంపూడి సుబ్బారావు, శ్రీను అధికారులను కలిసి పుష్పగుచ్చాలను అందజేసారు.

శతాధిక వృద్ధుడు ఎంఎల్‌ఎస్ మాస్టర్ మృతి

- పలువురు ప్రముఖుల సంతాపం
- ఉత్తమ ఉపాధ్యాయునిగా విద్యారంగానికి విశేష కృషి



పర్చూరు, ఆగస్టు 11 : శతాధిక వృద్ధులు.. విశ్రాంత ఉపాధ్యాయులు మల్లాది లక్ష్మీనారాయణ శాస్త్రి 101 (ఎంఎల్‌ఎస్ మాస్టర్) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేసి విద్యారంగానికి విశేష కృషి చేశారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా అనేక అవార్డులు పొందారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ అనంతరం హోమియో వైద్యుడిగా ప్రజలకు ఉచిత సేవలందించారు. దేవాలయాలు, ఆరాం క్షేత్రాలకు తనవంతు ఆర్థిక సాయాన్ని అం దించి దాతృత్వం చాటుకున్నారు. ఎంఎల్‌ఎస్ మాస్టర్ మృతికి పూర్వ విద్యార్థులు వి శ్రాంత టెలికం జీఎం యశోద ప్రసాద్, రాష్ట్ర సచివాలయం ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ, పాబోలు ఉదయభాస్కర్, కేఎస్ ఆర్‌కే ప్రసాద్, ప్రముఖ న్యాయవాది కొల్లా నరేంద్రకుమార్, రావి సత్యనారాయణ, కొల్లా సుబ్బారావు, కఠారి సురేంద్రబాబు, శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం తెలిపారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

- ఆక్రమణలు, రీసర్వే సమస్యలపై అర్జీల స్వీకరణ
- తహసీల్దార్, ఏడుగురు అధికారులతో నిర్వహణ
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



పర్చూరు, ఆగస్టు 11 : వైసీపీ పాలనలో భూదందాలు, అక్రమాల నిగ్గు తేల్చేందుకు, భూ సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుంచి సెప్టెంబరు 30వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఏలూరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామాలవారీగా భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతాంగ సమస్యలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. ఐదేళ్ల పాలనలో పెద్దఎత్తున భూ అక్రమణలు జరిగాయని ఆరోపించారు. అనేక మంది సామాన్య మధ్యతరగతి ప్రజలను బెదిరించి భూములను స్వాధీనం చేసుకున్నారని దీనిపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఆధికార యంత్రాంగం ప్రజల చెంతకు వెళ్లనున్న ట్లు ఆయన ఈసందర్భంగా తెలియజేశారు. ప్రజాక్షేత్రంలో అక్కడికక్కడే సమస్యలను తెలుసుకునేలా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా రంగం సిద్ధం చేసిందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు మరో 45 రోజల గడువు ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. తహసీల్దార్‌తో పాటు, ఆయా భూముల వ్యవహారాలతో సంబంధం ఉన్న అటవీ, దేవదాయ ఇతర శాఖ ల అధికారులు సైతం ఈ సదస్సులో పాల్గొంటారన్నారు. సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రచించిందన్నారు. వైసీపీ హయాంలో నిషిద్ధ జాబితా నుంచి ఫ్రీహోల్డ్ పేరుతో తప్పించిన భూముల రిజిస్ట్రేషన్‌లపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందన్నారు. అసైన్డ్, చుక్కల భూములు, షరతులున్న వేల ఎకరాల భూములను నిషిద్ధ జాబితా నుంచి తప్పించి వైసీపీ నేతలు రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్తు రైతుల పొలాలు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని ఏలూరి కోరారు.

గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ఏలూరి తెలిపారు. 16 నుంచి వచ్చేనెల 30 వరకు గ్రామాలవారీగా సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. ఈసదస్సులో ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకరణలో బొడ్డురాయి

వైభవంగా బొడ్డురాయి ప్రతిష్ఠ

బల్లికురవ, ఆగస్టు 11: మండలంలోని మల్లయ్యపాలెం గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా గ్రామ బొడ్డురాయి, గవిడి రాళ్ల ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. గత మూడు రోజుల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పూజాకార్యక్రమాల అనంతరం గవిడి రాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్థులు సమష్టి కృషితో రూ.13లక్షల విరాళాలు సేకరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పదివేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధునికి ఆర్థిక సాయం అందజేత

మార్టూరు, ఆగస్టు 11 : మార్టూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో నివసిస్తున్న బొచ్చ పోలయ్య అనే వృద్ధుడికి హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆదివారం రూ.5వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలి, గుర్రం శ్రీను, పుట్టా అయ్యప్ప స్వామి, షేక్ హబీబా పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి

వైభవంగా దేవస్థాన శత వార్షిక వేడుకలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి, (మార్టూరు) ఆగస్టు 11 : యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో ఆదివారం శ్రీ గంగా కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం శత వర్ష వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్త కాళహస్తి హరిబాబు సంప్రదాయకంగా స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ఏలూరి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామంలోని కాళహస్తి వంశస్థులతో పాటు, గ్రామస్థులు ముఖ్యంగా మహిళలు ఆలయానికి వచ్చి స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యద్దనపూడి టీడీపీ మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వేణుగోపాలస్వామి భూములకు కౌలు వేలం నిర్వహించాలి

అద్దంకి, ఆగస్టు 11 : దేవస్థానం భూములకు బహిరంగ కౌలు వేలం నిర్వహించకుండా అధికారులు ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దక్షిణ అద్దంకి పరిధిలో ఉన్న వేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించి సర్వేనెంబర్ 1787లో సుమారు 15ఎకరాలు సాగు భూమి ఉందని, ఆ భూమికి సంబంధించి కౌలుకు ఇచ్చేందుకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించకుండా, అనుకూలంగా ఉన్న కొద్దిమంది రైతులకు తక్కువ కౌలుకు ఇస్తున్నారని గొట్టిపాటి సుబ్బారావు దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కు పంపిన అర్జీలో పేర్కొన్నారు. అదే సమయంలో 3ఎకరాల భూమిని సమీప పొలాల రైతులు ఆక్రమించుకుని కనీసం కౌలు కూడా చెల్లించడం లేదని స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సుబ్బారావు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దేవాలయం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని, కౌలు బహిరంగ వేలం నిర్వహించి దేవాలయం ఆదాయం పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని సుబ్బారావు ఉన్నతాధికారులకు పంపిన అర్జీలో పేర్కొన్నారు.

అనుమతులా..అవెందుకు..?

- పంట కాలువను పూడ్చిన వైనం
- రియల్ వ్యాపారుల దందా
- ఇసుక, మట్టి అక్రమంగా తరలించి మెరకలు


పంట కాలువను పూడ్చి రియల్టర్ వేసిన వెంచర్

చీరాల, ఆగస్టు 11 : స్థిరాస్తి విలువ పెరగడంతోపాటు భూముల కొనుగోలు, అమ్మకాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రియల్ వ్యాపారుల్లో కొందరు నిబంధనలను తుంగలో తొక్కి రూపాయల వేటలో పడ్డారు. అందుకు పాలక, ప్రతిక్షాలతో సంబంధాలున్న వ్యక్తులు భాగస్వాములుగా మారుతున్నారు. దీంతో నిబంధనలు అమలు చేయడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. అనుమతులా .. అవెందుకని సదరు రియల్ వ్యాపారులు తమ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించడం పరాకాష్ట. అంతిమంగా కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

స్థలం ఉందా.. ప్లాట్లు వేద్దాం

నిబంధనలు మనకు వర్తించవు. మేం వేసే వెంచర్‌లో పాలక, ప్రతిపక్షాలకు చెందినవారం ఉన్నాం. ముందుగా ప్లాట్లు బుక్ చేసుకున్న వారికి రేటు తక్కువ. లేదంటే తరువాత అదే స్థలం డబుల్ రేటు చెల్లించాల్సి వస్తోందంటూ రియల్ సిండికేట్ వ్యాపారులు దందా సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సదరు వ్యక్తుల వెంచర్‌కు ఇసుక, మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను వీఆర్వోల సమాచారం మేరకు పోలీసులు అడ్డుకున్నారు. తరువాత జరిగిన పరిణామాలక్రమంలో వాటిని వదిలేశారు. వేటపాలెం మండలం పాపాయిపాలెం రోడ్డుకు సమీపంలో వేసిన వెంచర్‌కు సంబంధించి జరిగిన ఈ ఘటన ప్రస్తుతం రియల్ వ్యాపారులతో పాటు రాజకీయ వర్గాల్లోను జోరుగా చర్చ సాగుతోంది. ఆ వెంచర్‌కు సంబంధించి ఒకరు కొత్తపేటకు చెందిన వ్యక్తి కాగా, మరొకరు పాపాయిపాలెంకు చెందిన వ్యక్తి. ఆ వెంచర్‌లో భాగస్వాములు. ఈ నేపథ్యంలో సదరు వ్యక్తులు రియల్ వెంచర్‌కు సంబంధించి కనీస మార్గదర్శకాలు పాటించకుండా, నిబంధనలను తుంగలో తొక్కి పనులు ప్రారంభించారు. ఇదిలావుంటే ఆ ప్రాంతంలో రైతుల పంట పొలాలకు సాగునీరు సరఫరా అయ్యే పంటకాలువను పూడ్చి వెంచర్‌కు అనుకూలంగా మార్చుకున్నారు. వారు చెప్పే అధికార అండ పేరుతో రైతులు తమకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పేందుకు వెనకడుగు వేస్తున్నారు. కొందరు రైతులు మాత్రం ఈ రోజు నోరు మెదపకపోతే భవిష్యత్‌లో తమ పంట పొలాలు బీడులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సదరు వెంచర్‌కు మట్టి, ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను కొందరు అడ్డుకున్నారు. అది రెవెన్యూ, పోలీస్ దృష్టికి వెళ్లింది. తరువాత ఏం ఒత్తిళ్లు వచ్చాయో ఏమో పట్టుకున్న ట్రాక్టర్లను వదిలేశారు. దీంతో ఆ రియల్ వ్యాపారులు మీసాలు మెలేస్తున్నారు. ఆవిషయం పక్కన పెడితే అనుమతులు లేని వెంచర్లు ఎలా వేశారు..? అక్రమ దందాలకు ఎవరు ఊతం ఇస్తున్నారనే అంశంపై ప్రజలు, రాజకీయ వర్గాల్లోను జోరుగా చర్చ సాగుతోంది. ఈ క్రమంలో అనుమతులులేని అనధికారిక వెంచర్లపై పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.